

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




నారా రోహిత్ వివాహ వేడుకలో సీఎం చంద్రబాబు దంపతులు 5

# నష్టం.. రూ.5265 కోట్లు!



- తుపాను నష్టాల ప్రాథమిక అంచనా వెల్లడించిన ముఖ్యమంత్రి
- సమష్టి కృషి, టెక్నాలజీ సాయంతోనే తుపాను నష్టాల నివారణ
- ప్రకృతి విపత్తులను ఎదుర్కొవడంలో ప్రభుత్వ చర్యలు.. ఒక మాన్యువల్
- క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పర్యటించారు
- గ్రామస్థాయి సిబ్బందినుంచి సీఎస్ వరకు అప్రమత్తంగా వ్యవహరించారు
- 'మొంథా'ను టెక్నాలజీ సాయంతో అధిగమించాం..
- నష్టాల లెక్కలపైనా 'సాంకేతిక' సాయంతోనే ముందుకెళ్తున్నాం
- తుపాను పరిణామాలపై మీడియాతో సీఎం చంద్రబాబు నాయుడు

2

# 'నైపుణ్యం'.. ఉద్యోగాల గేట్‌వే!

- నవంబర్‌లోగా పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలి
- ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు
- నైపుణ్యాభివృద్ధితో పాటు ఉన్నత విద్యకు సహకారం
- శిక్షణ పూర్తయితే స్కిల్ టెస్టింగ్, ధృవపత్రాల జారీ



2

- ఆర్టీఐహెచ్‌తో విద్యార్థుల ఆవిష్కరణల అనుసంధానం
- నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం

## టేక్ ఏ బౌ..

### టీమిండియా మహిళా క్రికెట్ జట్టుకు సీఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి (చైతన్య రథం): సెమీ-ఫైనల్స్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత విజయం సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టును సీఎం చంద్రబాబు అభినందించారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. 'మహిళల ప్రపంచ కప్ ఫైనల్స్‌కు చేరుకుని చరిత్ర సృష్టించినందుకు మన దేశ మహిళా క్రికెట్ జట్టును చూసి గర్విస్తున్నాను. వన్డే ప్రపంచ కప్ నాకౌట్‌లో తొలిసారిగా 300 ప్లస్ పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో తమ జీవితాల ఇన్నింగ్స్ ఆడిన జెమిమా రోడ్రిగ్స్. హర్మన్‌ప్రీత్ కౌర్‌లను ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నాము. కీర్తి కోసం పోరాడుతూనే ఉండండి. మహిళా క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



## కుటుంబంతో కలిసి నారా రోహిత్ వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్

హైదరాబాద్ (చైతన్యరథం): కుటుంబంతో కలిసి సోదరుడు నారా రోహిత్ వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. హైదరాబాద్ అజీజ్ నగర్ లోని ద వెన్యూ కన్వెన్షన్ లో గురువారం రాత్రి జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు నారా రోహిత్, శిరీషలను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారా, నందమూరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పరకామణి కేసును ఎందుకు నీరుగార్చారు?

- నిందితులతో రాజీకి ఎలా అంగీకరించారు
- జగన్‌రెడ్డి, డీజీపీనా..ఎవరు ఒత్తిడి తెచ్చారు
- స్వామి వారి సొమ్ము కొట్టేయడానికి కుట్రలా
- నిందితులకు పోలీసుల రాచమర్యాదలా
- భూమన తల నరుక్కోవద్దు..నిజాలు చెప్పాలి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

6





# అనుభవమే ఆదుకుంది!

- తుఫాన్ సహాయక చర్యల్లో ప్రతిబింబించిన సీబీఎన్ మార్క్
- ఆర్టీజీ సెంటర్ నుంచి రియల్ టైమ్‌లో పర్యవేక్షణ, దిశానిర్దేశం
- ఫైవ్ పాయింట్ ఫార్ములాతో మొంథాను ఎదుర్కొన్న ఏపీ
- మానిటర్, అలెర్ట్, రెస్క్యూ, రిహాబిలిటేషన్, నార్మల్సీపైనే ఫోకస్
- రక్షణ, సహాయక చర్యల్లో పూర్తిస్థాయిలో సాంకేతిక వినియోగం
- ఫైవ్ డేస్ ఫైట్‌లో అధికార యంత్రాంగం సూపర్ సక్సెస్
- ప్రభుత్వ ముందస్తు చర్యలతో తగ్గిన ఆస్తి, ప్రాణ నష్టాలు..
- క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల్ని పరామర్శించిన ముఖ్యమంత్రి

3

# రియల్ టైమ్ మానిటరింగ్ సొల్యూషన్




- మొంథా తుఫాన్ పర్యవేక్షణలో హైఎండ్ టెక్నాలజీ వినియోగం
- వివిధ మార్గాల నుంచి వచ్చిన డేటాతో సమగ్ర విశ్లేషణ
- ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంత మేర తగ్గించిన టెక్నాలజీ
- 602 డ్రోన్లు, 14,770 సీసీ టీవీలతో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పర్యవేక్షణ
- 1.1 కోట్ల మెసేజీలతో ప్రభావిత ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేసిన ఆర్టీజీఎస్ కేంద్రం
- సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంతో టెక్నోక్రాట్లుగా మారి తుఫాన్ సహాయక చర్యలను పర్యవేక్షించిన ఐఏఎస్‌లు
- టెక్నాలజీతో మొంథా తుఫాన్ పర్యవేక్షణ చేసిన విధానాన్ని వివరించిన ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్

4

# నష్టం.. రూ.5265 కోట్లు!

- తుపాను నష్టాల ప్రాథమిక అంచనా వెల్లడించిన ముఖ్యమంత్రి
- సమిష్టి కృషి, టెక్నాలజీ సాయంతోనే తుపాను నష్టాల నివారణ
- ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంలో ప్రభుత్వ చర్యలు.. ఒక మాన్యువల్
- క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పర్యటించారు
- గ్రామస్థాయి సిబ్బందినుంచి సీఎస్ వరకు అప్రమత్తంగా వ్యవహరించారు
- 'మొంథా'ను టెక్నాలజీ సాయంతో అధిగమించాం..
- నష్టాల లెక్కలపైనా 'సాంకేతిక' సాయంతోనే ముందుకెళ్తున్నాం
- తుపాను పరిణామాలపై మీడియాతో సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి (చైతన్య రథం): మొంథా తుపానువల్ల రాష్ట్రానికి రూ.5,265 కోట్లమేర నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శాటిలైట్ చిత్రాలు, డ్రోన్లు, సీసీ కెమెరాల సాంకేతికత వినియోగించి ప్రాథమిక నష్టాల అంచనాలు రూపొందించామన్నారు. మొంథా తుపాను ప్రభావంతో కలిగిన నష్టాన్ని కూడా టెక్నాలజీ సాయంతోనే తగ్గించినట్టు సీఎం స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన సీఎం.. రాష్ట్రంపై తుపాను ప్రభావం, టెక్నాలజీ సాయంతో నష్ట నివారణ అంశాలను వివరించారు. వ్యవసాయ పంటలకు రూ.829 కోట్లు, ఉద్యానరంగంలో రూ.39 కోట్లు, సెరీకల్చర్ రూ.65 కోట్లు, ఆక్వా రంగంలో రూ.1,270 కోట్లు, ఆర్ అండ్ బీకి రూ.2,079 కోట్లు, మున్సిపల్ శాఖలో రూ.109 కోట్లు, జలవనరుల విభాగంలో రూ.207 కోట్లు, పంచాయితీరాజ్ రూ.8 కోట్లు, విద్యుత్ శాఖ రూ.16 కోట్లు, పశుసంవర్ధక శాఖలో రూ.71 లక్షలు నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయన్నారు. త్వరలోనే నష్టం అంచనాలను తయారుచేసి కేంద్రానికి నివేదిస్తామన్నారు. "సాంకేతిక పరిజ్ఞానంతో తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశాం. అత్యంత ఖచ్చితత్వంతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు హెచ్చరికల్ని చేరవేయగలిగాం. టెక్నాలజీ సాయంతో తుఫాన్ ప్రభావంవల్ల కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేశాయి. మొదటిరోజునే పరిస్థితులను చాలావరకూ చక్కదిద్దాం. ఎప్పటికప్పుడు తుఫాన్ ప్రభావంపై సమీక్షలు నిర్వహించాం. అంతర్వేదికి సమీపంలో తీరందాటిన తుపాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయి. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తుఫాన్ పరిస్థితిని అంచనా వేశాం. సన్నద్ధత, ముందస్తు ప్రణాళికలతో ప్రకృతి వైపరీత్యంవల్ల జరిగిన నష్టాన్ని బాగా



నివారించాం. వర్షాలు, గాలుల తీవ్రతను అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసి చర్యలు తీసుకున్నాం. గతంలో తుఫాన్ ప్రభావం తగ్గిన వారం రోజులవరకూ కోలుకునే పరిస్థితి ఉండేది కాదు. తుఫాన్లు, వర్షాలను ఆపలేం కానీ అప్రమత్తత, ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశముంది. తుఫాను ప్రభావం ఉన్న అన్ని ప్రాంతాల్లో టెక్నాలజీ ద్వారా నష్టాలను నివారించాం. భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఎక్కడెక్కడ ప్రవాహాలు పెద్దఎత్తున వస్తాయనేది అంచనా వేసి ముందస్తుగా హెచ్చరికలు ఇచ్చాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాకు వివరించారు.

### ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ఓ మాన్యువల్

"మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శినుంచి కలెక్టర్ వరకూ, లైన్ డిపార్టుమెంట్ల నుంచి గ్రామ వార్డు సచివాలయం వరకూ ఉద్యోగులు, సిబ్బంది తుపాను నష్టాల తీవ్రతను తగ్గించటంలో కృషి చేశారు. ఆర్టీజీఎస్‌నుంచి మంత్రులు లోకేష్, అనితలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయికి ఆదేశాలు జారీ చేశారు. అంతా కలిసి సమష్టిగా పనిచేయబట్టే ఇది సాధ్యమైంది. వారందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను. గతంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా.. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదు. రియల్ టైమ్‌లోనే డేటా లేక్ ద్వారా సమాచారం విశ్లేషించి త్వరగా నిర్ణయాలు తీసుకోగలిగాం. టెక్నాలజీ వినియోగించి పంట నష్టాలు, ముంపు ప్రాంతాలు తదితర అంశాలను కూడా గుర్తించాం. ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూస్తుంటే కొందరు ఫేక్ మనుషులు.. ఫేక్ పోస్టులు పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడం కూడా వారికి ఇష్టం లేనట్టుంది. తుపాను కారణంగా నెల్లూరు నుంచి విశాఖ వరకూ భారీ వర్షాలు కురిసినా రాయలసీమలో కొన్నిచోట్ల వర్షాలు పడలేదు. వర్షాభావంతో కొన్ని ప్రాంతాలున్నాయి. రాష్ట్రంలో మొత్తం 37 కరవు మండలాలుగా ప్రకటిస్తున్నాం. ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మొంథా తుపాను అనుభవాన్ని ఓ మాన్యువల్‌గా రూపొందిస్తాం. టెక్నాలజీ వినియోగం ప్రజాప్రయోజనాల కోసమే"నని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# 'నైపుణ్యం'.. ఉద్యోగాల గేట్‌వే!

- నవంబర్‌లోగా పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలి
- ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు
- నైపుణ్యాభివృద్ధితో పాటు ఉన్నత విద్యకు సహకారం
- శిక్షణ పూర్తయితే స్కిల్ టెస్టింగ్, ధృవపత్రాల జారీ
- ఆర్టీఐహెచ్‌తో విద్యార్థుల ఆవిష్కరణల అనుసంధానం
- నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి (చైతన్య రథం): యువతకు నైపుణ్య శిక్షణనిస్తూనే, ఉన్నత విద్య అభ్యసనకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారికోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్‌వేగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029కల్లా 20 లక్షలు ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్‌మేళాలు నిర్వహించాలని అధికారులను సీఎం ఆదేశించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా 'నైపుణ్యం' పోర్టల్ ప్రారంభించి, అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇకనుంచి అధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేయాలన్నారు. గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధి మంత్రి నారా లోకేష్‌తోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. నైపుణ్యం పోర్టల్, జాబ్ డ్యాష్ బోర్డ్, వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలు తదితర అంశాలను సమీక్షలో చర్చించారు.

### క్లస్టర్ల ఆధారంగా నైపుణ్య శిక్షణ: మంత్రి లోకేష్

క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని... స్పేస్, ఆక్వా, క్వాంటంలాంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి లోకేష్ ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరుల్ని అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని సీఎంకు వివరించారు. ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేసి అమలు చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా నైపుణ్యం పోర్టల్‌ను అభివృద్ధి చేయడమే కాకుండా... నైపుణ్య కల్పనలో దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదించాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. విశ్వవిద్యాలయాలు, జాతీయ-అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రభుత్వంనుంచి ఏ లబ్ధి పొందకుండా నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా నైపుణ్యం పోర్టల్ తీర్చిద్దాలన్నారు. అభ్యర్థులు ఏ రంగంలో తమకు ఉద్యోగం, ఉపాధి కావాలని కోరుకుంటున్నారో... ఆ అవకాశాన్ని పొందేలే వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలని సీఎం సూచించారు.

### అన్ని శాఖలు, విభాగాల డేటా అనుసంధానం:

ఇప్పటివరకు రాష్ట్రంలో నిర్వహించిన జాబ్‌మేళాల ద్వారా 1,44,000 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నైపుణ్యం పోర్టల్‌నుంచి ఏఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్ రూపొందించుకునే వెసులుబాటు కల్పించినట్టు వెల్లడించారు. వాట్సాప్ ద్వారా ఉద్యోగావకాశాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అన్ని శాఖలు, విభాగాల డేటా బేస్ సమీకృతం చేసి నిజమైన నిరుద్యోగులను గుర్తిస్తున్నామని అధికారులు వివరించారు. ఎక్కడ, ఏరంగంలో శిక్షణ అందిస్తున్నాం.. జాబ్ మేళాలు ఏ ప్రాంతంలో నిర్వహిస్తున్నాం.. ఏయే సంస్థల్లో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే దానిపై పోర్టల్ నుంచి అభ్యర్థులకు సమాచారం అందేలా తీర్చిదిద్దామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యేలా ఏఐ సిమ్యులేటర్ సైతం నైపుణ్యం పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు.

### విదేశీ భాషల్ని నేర్చుకునేలా శిక్షణ

"పోర్టల్‌లో ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలు, వివిధ విద్యా సంస్థలతో పరిశ్రమలు, సంస్థలను అనుసంధానించాలి. విద్యా సంస్థలకు ఫ్యూచర్ ట్రెండ్స్ తెలిసేలా చేయాలి. ప్లేస్మెంట్ వివరాలనూ ట్రాకింగ్ చేసేలా ఉండాలి. స్కిల్ టెస్టింగ్‌కు కూడా అవకాశం కల్పించాలి.

పాఠశాలస్థాయిలో విద్యార్థుల నూతన ఆవిష్కరణలను మరింత ఉన్నతీకరించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానించాలి. విదేశాల్లో ఉద్యాగావకాశాలు సులభంగా పొందేందుకు వీలుగా ఆయా దేశాల స్థానిక భాషలను నేర్చుకునేలా శిక్షణ అందించాలి. ఏపీ ఎన్ఆర్టీ ద్వారా ఉద్యోగ సమాచారం పొందేలా చూడాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఏపీలో యువత అందరికీ ఏరంగంలో నైపుణ్యం కావాలో దానికి సంబంధించిన శిక్షణ... అలాగే ప్రస్తుతమున్న సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేలా పున:శిక్షణ, ఉత్తమ శిక్షణ అందించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# అనుభవమే ఆదుకుంది!

- తుఫాన్ సహాయక చర్యల్లో ప్రతిబింబించిన సీబీఎన్ మార్క్
- ఆర్టీజీ సెంటర్‌నుంచి రియల్ టైమ్‌లో పర్యవేక్షణ, దిశానిర్దేశం
- ఫైవ్ పాయింట్ ఫార్ములాతో మొంథాను ఎదుర్కొన్న ఏపీ
- మానిటర్, అలెర్ట్, రెస్క్యూ, రిహాబిలిటేషన్, నార్మల్సీపైనే ఫోకస్
- రక్షణ, సహాయక చర్యల్లో పూర్తిస్థాయిలో సాంకేతిక వినియోగం
- ఫైవ్ డేస్ ఫైట్‌లో అధికార యంత్రాంగం సూపర్ సక్సెస్
- ప్రభుత్వ ముందస్తు చర్యలతో తగ్గిన ఆస్తి, ప్రాణ నష్టాలు..
- క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల్ని పరామర్శించిన ముఖ్యమంత్రి



అమరావతి (చైతన్య రథం): మానిటర్, అలెర్ట్, రెస్క్యూ, రిహాబిలిటేషన్, నార్మల్సీ. మొంథా తుఫాను విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని బృందం అమలు చేసిన పంచసూత్ర ప్రణాళిక ఇదే. తుఫాన్ హెచ్చరికలు వచ్చిన నాటినుంచి నిరంతరం మానిటర్ చేసుకోవడం... ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని.. ప్రజలను అలెర్ట్ చేయడం, నీట మునిగిన ప్రాంతాల్లో ఉన్నవారిని ఆదుకోవడం, వారికి పునరావాసం కల్పించడం.. తుఫాన్ తగ్గాక.. సాధారణ పరిస్థితులకు తీసుకురావడం. మొంథా తుఫాన్ సమయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని బృందం ఈ అంశాలపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టింది. దీనికి పూర్తిస్థాయి టెక్నాలజీని జోడించడం, క్షేత్రస్థాయిలో మంత్రులు, అధికారులు, ఉద్యోగులతో కూడిన బృందాలతో సమర్థవంతంగా పని చేయించడంతో మొంథా తుఫానువల్ల కలిగే నష్టాన్ని చాలావరకు నివారించగలిగింది. ప్రకృతి విపత్తును నివారించే అవకాశం లేదు కాబట్టి... నష్టాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవాలనే లక్ష్యంతో టీం ఆంధ్రప్రదేశ్ పనిచేసింది. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించుకునే దిశగా ఐదు రోజులపాటు రాత్రీపగలూ తేడా లేకుండా అధికార యంత్రాంగం పనిచేసింది. ఇదే ఇప్పుడు సత్ఫలితాలను ఇచ్చింది. మొంథా తుఫాన్ ప్రభావం రాష్ట్రంమీద ఎక్కువగా ఉంటుందనే వాతావరణ హెచ్చరిక రాగానే సీఎం చంద్రబాబు అలెర్టయ్యారు. తుఫాన్ కదలికలను నిరంతరం మానిటర్ చేసుకోవడం... ఏయే ప్రాంతాల్లో ఎక్కువ తుఫాన్ ప్రభావం ఉండొచ్చనే విషయాలపై మానిటరింగ్ చేసుకోవడం... ఆ దిశగా క్షేత్రస్థాయిలో ఉన్న వారిని అలెర్ట్ చేస్తూ... మొంథా తుఫాన్ తీరాన్ని తాకినా... ప్రజల జీవితాలను తాకకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంది ప్రభుత్వం. కొద్దిపాటి ప్రభావం ఉంటుందనుకున్న ప్రాంతాల్లోని వారినీ పునరావాస శిబిరాలకు తరలించారు. లక్షమందికి పైగా ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించి అన్ని రకాల ఏర్పాట్లూ చేశారు. క్షేత్రస్థాయినుంచి రియల్ టైంలో సమాచారాన్ని తీసుకోవడం.. దాన్ని విశ్లేషించడం... వాటిని ఆయా విభాగాల బాధ్యులకు చేరవేసి.. సమస్యను పరిష్కరించేలా చూడడంవంటి ప్రక్రియను సీఎం చంద్రబాబు నేతృత్వంలో బృందం సమర్థవంతంగా అమలు చేసింది. ఇక సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో పర్యటించి... బాధితులకు భరోసా ఇచ్చారు.

## అనుభవానికి టెక్నాలజీ తోడు

ఇక ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేలా ప్రభుత్వం ఈ విపత్తుకాలంలో పని చేసింది. శిశువులనుంచి వృద్ధుల వరకు.. అలాగే గర్భిణులనూ సంరక్షణ కేంద్రానికి తరలించింది. పశువుల ప్రాణాలను కాపాడేందుకు యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో సమాయత్తం చేసింది. దీనికి టెక్నాలజీని జోడించారు. దీంట్లో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు వరుసగా 1.1 కోట్ల సందేశాలు పంపారు. అలాగే సాంకేతికతను జోడించి గ్రామాల్లో మైక్‌ద్వారా అనౌన్సుమెంట్ చేసే విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆర్టీజీ సెంటర్ నుంచే సెల్ ఫోన్ ద్వారా మైక్ ఎనౌన్సుమెంటును ఆపరేట్ చేసే విధానాన్ని రూపొందించడమే కాకుండా.. ఒకవేళ సెల్‌ఫోన్ సిగ్నల్ లేకపోతే శాటిలైట్ ద్వారా ఆ వ్యవస్థ పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. ఇలాంటి చర్యలవల్ల గతంతో పోల్చితే ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పునరావాస శిబిరాలకు తీసుకురావడం సులువైంది. సహజంగా లంక గ్రామాల ప్రజలు తమ ఇళ్లను వదిలి రావడానికి ఇష్టపడరు. తుఫాన్లు వచ్చినా... ఇళ్ల పైకప్పులపైకి ఎక్కుతారు. కానీ ప్రభుత్వం ముందుగానే అలెర్ట్ చేయడంతోపాటు... క్షేత్రస్థాయి సిబ్బంది కూడా ఇంటింటికీ వెళ్లి వారికి నచ్చచెప్పి తుఫాన్ షెల్టర్లకు తీసుకొచ్చింది. దీంతో ప్రాణనష్టానికి స్థానం లేకుండా చేయగలగింది. ఇక టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని మరోసారి రుజువైంది. బాపట్ల జిల్లా పర్చూరు వాగులో కొట్టుకుపోతున్న షేక్ మున్నా అనే వ్యక్తిని డ్రోన్ల ద్వారా గుర్తించి పోలీసులు, అధికారుల బృందం అతణ్ని రక్షించింది. అలాగే ప్రభుత్వం వద్ద ఉన్న అలెర్ట్ మెకానిజం ద్వారా త్వరగా రెస్పాండ్ కావడం వల్లే బాపట్ల జిల్లాలోనే ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లి చిక్కుకుపోయిన 15మందిని రెస్క్యూ ఆపరేషన్ చేసి కాపాడారు. ఈ విషయంలో ఏమాత్రం అలక్ష్యం వహించినా..వారిప్రాణాలు దక్కేవి కాదు. ఇక గర్భిణులు, దివ్యాంగుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లుచేసింది. టెక్నాలజీతోపాటు... ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా హ్యాండిల్ చేయాలనే అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకున్న అనుభవం రాష్ట్రానికి మేలు చేసింది.

## లైవ్ ట్రాకింగ్, రియల్ టైం సొల్యూషన్స్

పంటలకు నష్టం వాటిల్లకుండా కూడా ప్రభుత్వం వీలైనంత మేరకు జాగ్రత్తలు తీసుకుంది. తుఫాను హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి కాల్వల్లో గుర్రపు డెక్క తొలగించే అంశాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈవిధంగా చేయడం ద్వారా వీలైనంతమేర పంట నష్టం తగ్గించగలిగారు. ఇక డ్రెయిన్లు కూడా క్లీనప్ చేయడంతో... నగరాల్లో కూడా నీటినిల్వ లేకుండా చూడడంలో అధికార యంత్రాంగం విజయం సాధించింది. ఇకతుఫాన్ గాలులకు చెట్లుపడిపోయినా.. విద్యుత్ స్థంభాలు పడిపోయినా, వైర్లు తెగిపడినా వాటి కారణంగా ట్రాఫిక్ జాం కాకుండా, ప్రమాదాలు జరగకుండా..వెంటనే వాటిని తొలగించడంతోపాటు.. విద్యుత్ వ్యవస్థను అతి తక్కువ సమయంలోనే పునరుద్ధరించారు. దీనికోసం అవసరమైన సామాగ్రి, వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకున్నారు. వేలకొద్దీ యంత్రాలను.. వాహనాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకున్నారు. ఇక సహాయక చర్యల నిమిత్తం జేసీబీలను భారీఎత్తున సిద్ధం చేశారు. వాటికి లైవ్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అవసరమైన మేరకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగింది. గతంలో వర్షాలు వచ్చినా.. వరదలొచ్చినా.. బోట్లు కొట్టుకురావడం.. బ్యారేజీల గేట్లకు బలంగా తాకడం వంటివి జరిగేవి. కానీ ఈసారి అలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంట్లో భాగంగానే... నెల్లూరు జిల్లా కలెక్టర్ తనకు అందిన సమాచారంతో అలెర్ట్ కావడంతో భారీ బోటును చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. లేకుంటే సంగం బ్యారేజీకి ఆ బోట్లు ఢీ కొట్టి.. ప్రమాదం సంభవించేది. ఇవన్నీ ముందు జాగ్రత్తలు తీసుకోవడం, అలెర్ట్ మెకానిజం ఉండడంవల్ల తప్పిన ప్రమాదాలే. ఇక కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా నిరంతరం పర్యవేక్షించడంతోపాటు... గండ్లుపడితే వాటిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చేందుకు అవసరమైన ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. అలాగే రాష్ట్ర సచివాలయం లో ఆర్టీజీ సెంటర్ ద్వారా వచ్చిన ఆదేశాలు గ్రామ సచివాలయస్థాయిలో వెంటనే అమలు చేయగలిగేలా విజయవంతంగా ప్రభుత్వం పని చేసింది.

## త్వరితగతిన నష్టపరిహారం అందచేయడం...

ఇక పునరావాస శిబిరాలను ముందుగానే సిద్ధం చేశారు. ఎప్పుడు అవసరమైతే.. అప్పుడు సహాయ శిబిరాలను హడావుడిగా ఏర్పాటు చేసుకునే పరిస్థితికి స్వస్తి చెప్పాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వాతావరణ హెచ్చరికలు వచ్చినప్పట్నుంచి పునరావాస శిబిరాలను సిద్ధం చేసుకోవాలని చెప్పడమే కాకుండా.. వాటిని అమల్లో పెట్టేలా చేశారు సీఎం. బాధితులకు ఆహారం, వసతి కల్పించడంతోపాటు.. కావాల్సిన మందులను కూడా పునరావాసంలో అందుబాటులో ఉంచారు. ఇలాంటి ఏర్పాట్లను సిద్ధం చేయడంతోపాటు.. పునరావాస కేంద్రాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే వైద్య బృందాలను సిద్ధం చేశారు. బాధితులకు అందించే నిత్యావసర వస్తువులను.. ఆర్థిక సాయాన్ని ముందుగానే ప్రభుత్వం సిద్ధం చేసుకుంది. ఇక పునరావాస శిబిరాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు... తుఫాన్ వెలిశాక.. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. పంటనష్టం అంచనాలను త్వరితగతిన వేసి.. కేంద్రానికి వీలైనంత త్వరగా నివేదికలు సమర్పించే వరకు పూర్తిస్థాయిలో ముందస్తు ప్రణాళికలతో ప్రభుత్వం వ్యవహరించింది.









# దమ్ము, ధైర్యం ఉంటే.. జగన్ బహిరంగ చర్చకు రావాలి

- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సవాల్
- పంటల బీమాపై నిస్సిగ్గుగా జగన్ అబద్ధాలు
- మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు కుయుక్తులు
- బుద్ధిలేకుండా, కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడంటూ మండిపడ్డ మంత్రి అచ్చెన్నాయుడు
- రాష్ట్రంలో 95% ఈ క్రాప్ నమోదు, నవంబర్ 12 లోపు మిగిలిన 5% పూర్తి

అమరావతి (చైతన్యరథం): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి మళ్లీ అబద్ధాల తుపాను సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని వ్యవసాయ, సహకార, ఉద్యాన, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. తుపాను ప్రభావం, పంటల నష్టంపై మాట్లాడే ముందు జగన్ తన పాలనలో రైతులకు చేసిన అన్యాయాలను గుర్తు చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. రైతు సంక్షేమం పేరుతో మాట్లాడే హక్కు జగన్ రెడ్డికి లేదన్నారు. పంటల బీమాపై జగన్ నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. రైతులకు సాయం చేసిందెవరో తేల్చుకునేందుకు బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు మంత్రి సవాల్ విసిరారు. జగన్ పాలనలోనే రైతులు కష్టాల బాట పట్టారు. ఉచిత పంట బీమా పేరుతో కోట్ల రూపాయల మోసం జరిగింది. బీమా కోసం రైతులు నెలల తరబడి తిరిగినా, ఒక్క రూపాయి పరిహారం కూడా అందలేదు. ఇప్పుడు సిగ్గు లేకుండా బీభత్సమైన గణాంకాలు చెప్పి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. జగన్ పేర్కొన్న ఇ-క్రాప్, ఆర్బీకే, సచివాలయ వ్యవస్థలు కేవలం రాజకీయ ప్రదర్శనలేనని, వాస్తవంలో వాటి ఫలితం శూన్యమని మంత్రి తేల్చిచెప్పారు. మీ పాలనలో రైతులు నష్టపోయినా పరిహారం ఇవ్వలేదు. మిర్చి, మామిడి, పొగాకు కొనుగోళ్లు చేస్తామన్నారు.. కానీ ఒక్క రూపాయి చెల్లించలేదు. రైతుల చెమటను చెల్లని వాగ్దానాలతో తుడిచేందుకు ప్రయత్నించిన అసమర్థ పాలన జగన్‌దే అని మంత్రి విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన నష్టం అంచనా వేయించి, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, తక్షణ సహాయ చర్యలు, బీమా పరిహారాలు అందజేస్తోందని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రైతు కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మాటలు కాదు చర్యలతో మేము నిరూపిస్తున్నామని అని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో 95% ఈ క్రాప్ నమోదయిందని, నవంబర్ 12 లోపు మిగిలిన 5% పూర్తి చేస్తామన్నారు.



## రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం

రైతు కష్టసుఖాల్లో అండగా నిలవడం కూటమి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముడవుతున్న పంటలకు వెంటనే మార్కెట్ జోక్యం కింద సాయం అందించేందుకు ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి రూ.300 కోట్లను బడ్జెట్‌లో మంజూరు చేసిందన్న విషయం జగన్ గుర్తుపెట్టుకోవాలన్నారు. ఇప్పటివరకు సుమారు రూ.800 కోట్ల వరకు పంటల మద్దతు ధరల కోసం ఖర్చు పెట్టాం అని మంత్రి వివరించారు. వైసీపీ హయాంలో 2020లో మిర్చి ధర రూ.12,000 ఉన్నా, మద్దతు ధరగా రూ.7,000 మాత్రమే నిర్ణయించి, ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని మంత్రి మండిపడ్డారు. హెచ్‌డీ బర్లీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు తమ ప్రభుత్వం రూ.271 కోట్లు వెచ్చించి 20 వేల మిలియన్ కిలోల కొనుగోలుకు నిర్ణయం తీసుకుందని, అదనంగా వచ్చిన పంట కూడా కొనుగోలు చేశామన్న విషయాన్ని జగన్ గుర్తు పెట్టుకోవాలన్నారు. కోకో ధరలు తగ్గడంతో కిలోకు రూ.50 చొప్పున అదనంగా చెల్లించాం. తోతాపూరి మామిడి ధరలు తగ్గినప్పుడు రూ.260 కోట్లు వెచ్చించి ప్రతి కిలోకు అదనంగా రూ.4 చొప్పున చెల్లించాం. టమాటా రైతులకు ధరలు పెరిగినప్పుడు వినియోగదారులకు సరసమైన ధరలు అందించడానికి రూ.8 కోట్లు వెచ్చించి రైతుల వద్ద నుండి 1781 మెట్రిక్ టన్నులు సేకరించి రైతు బజార్ల ద్వారా విక్రయించాం. అలాగే ధరలు తగ్గినప్పుడు రూ.3.25 కోట్లతో సుమారు 2800 మెట్రిక్ టన్నుల టమాటా కొనుగోలు చేసి రైతులకు ఉపశమనం కలిగించాం.

2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం కేవలం 3780 మెట్రిక్ టన్నుల టమాటా సేకరించగా, మా ప్రభుత్వం కేవలం 14 నెలల్లోనే 4672 మెట్రిక్ టన్నులు సేకరించిందన్న విషయం జగన్ తెలుసుకోవాలన్నారు. కర్నూలు జిల్లాలో ఉల్లి ధరలు తగ్గిన నేపథ్యంలో, మా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖల ద్వారా రూ.1200 క్వింటాకు కొనుగోలు చేసింది. ఉల్లికి హెక్టార్ కి రూ.50,000 ఇచ్చిన ప్రభుత్వం మాదే. కూటమి ప్రభుత్వం రైతు కష్టానికి అండగా ఉంది. మిర్చి కి రూ.11781 రూపాయలుకి కొంటామని చెప్పి కొనలేదని విమర్శిస్తున్నారు. అంటే మద్దతు ధరకు మించి మార్కెట్‌లో రూ.14000 నుండి రూ.15000 పలుకుతుంటే రైతు దగ్గర తక్కువకి కొని రైతుని ముంచేయమనేది జగన్ ఉద్దేశ్యమా అని ఎద్దేవా చేశారు. రైతు ఉత్పత్తికి విలువ, శ్రమకు గౌరవం కల్పించడం మా బాధ్యతగా భావిస్తున్నాం. మాటలు కాదు చర్యలతో రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# రియల్ టైమ్ మానిటరింగ్... రియల్ టైమ్ సొల్యూషన్

- మొంథా తుఫాన్ పర్యవేక్షణలో హైఎండ్ టెక్నాలజీ వినియోగం
- వివిధ మార్గాల నుంచి వచ్చిన డేటాతో సమగ్ర విశ్లేషణ
- ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంత మేర తగ్గించిన టెక్నాలజీ
- 602 డ్రోన్లు, 14,770 సీసీ టీవీలతో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పర్యవేక్షణ
- 1.1 కోట్ల మెసేజీలతో ప్రభావిత ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేసిన ఆర్టీజీఎస్ కేంద్రం
- సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంతో టెక్నోక్రాట్లుగా మారి తుఫాన్ సహాయక చర్యలను పర్యవేక్షించిన ఐఏఎస్‌లు
- టెక్నాలజీతో మొంథా తుఫాన్ పర్యవేక్షణ చేసిన విధానాన్ని వివరించిన ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్

అమరావతి (చైతన్యరథం): ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అపార అనుభవం ఉంది. తుఫాన్ హెచ్చరికలు వచ్చినప్పట్నుంచి తుఫాన్ కదలికలను గమనించడం...ఆ మేరకు ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం.. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవడమనే అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సాధారణంగా ఎప్పుడూ చేస్తూనే ఉంటారు. అయితే మొంథా తుఫాన్ విషయంలో కొంత భిన్నంగా వ్యవహరించారు. రాత్రింబవళ్లు పర్యవేక్షిస్తూనే ... టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించారు సీఎం చంద్రబాబు. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి రియల్ టైమ్ డేటాను అప్డేట్ చేసుకుంటూ...వచ్చిన సమాచారాన్ని విశ్లేషించుకుంటూ... రియల్ టైంలోనే సమస్యలను పరిష్కరించేలా పని చేశారు. డేటా డ్రివెన్ డిజాస్టర్ మేనేజ్మెంట్ మోడల్ ఆవిష్కరించారు. ఇంటిగ్రేటెడ్ ప్లానింగ్, టెక్నాలజీని అనుసంధానించి రియల్ టైమ్‌లో సమన్వయం చేసుకోవడం..నిర్ణయాలు తీసుకోవడం.. అవి అమలు అయ్యేలా చూసుకోవడంలో ఈమోడల్ సక్సెస్ సాధించింది.సాంప్రదాయ పద్ధతులను అనుసరించడంతో పాటు..వివిధ శాఖల నుంచి ఆర్టీజీఎస్ సెంటర్‌కు వచ్చిన సమాచారాన్ని అనుసంధానించి అవేర్ (AWARE) 2.0 వ్యవస్థ ద్వారా తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలు తీసుకోవడంతోపాటు ప్రాణ,ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగింది ప్రభుత్వం. టెక్నాలజీ ద్వారా మొంథా తుఫాన్ సహాయక చర్యలను ఏవిధంగా మానిటర్ చేశారనే వివరాలను ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ మీడియాకు వివరించారు.సీఎం చంద్రబాబు తుఫాన్ హెచ్చరికలు వచ్చినప్పట్నుంచి తొమ్మిది సార్లు టెలీకాన్ఫరెన్సులు,ఆర్టీజీ సెంటర్ నుంచి నిరంతరం సమీక్షా సమావేశాలు చేపట్టారు. అలాగే వివిధ విభాగాలు, క్షేత్రస్థాయి అధికారులతో నిరంతరం టచ్‌లో ఉన్నారు.ఆర్టీజీఎస్ కంట్రోల్ రూమ్ నుంచి వచ్చిన లైవ్ డేటాతో, అవసరమైన ప్రాంతాలకు సహాయక చర్యలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసి... అమలు చేసేలా ప్రభుత్వం టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించింది.అవసరమైనచోట యంత్రపరికరాలను, మానవ వనరుల్ని సమర్థంగా కేటాయించటంలోనూ టెక్నాలజీనే సాయపడింది.

## టెక్నాలజీ వనరుగా అవేర్ 2.0

అవేర్ 2.0 వ్యవస్థకు స్టేట్ డేటాలేక్ ద్వారా అన్ని విభాగాలను అనుసంధానం చేశారు. దీని ద్వారా రియల్ టైములో నిర్ణయాలు తీసుకోవడానికి వీలు ఉంటుంది. వర్షపాతం, గాలి, పిడుగుల వంటి వాటిపై హెచ్చరికలు చేసేలా అవేర్-2.0 వ్యవస్థ పని చేస్తుంది. ఈ వ్యవస్థ ద్వారా విపత్తు నిర్వహణను సమర్థవంతంగా చేపట్టవచ్చు. అలాగే రిజర్వాయర్ స్థాయిలు, ఇన్‌ఫ్లోలు, భూగర్భ జలాలు చెరువులకు సంబంధించిన రియల్ టైమ్ డేటా అందుబాటులో ఉంటుంది.దీంతో శాటిలైట్ ద్వారా వివిధ ప్రమాదాలకు సంబంధించిన హెచ్చరికలు జారీ చేసే అవకాశముంది. అవేర్-2.0 వ్యవస్థ ద్వారా వచ్చే సమాచారాన్ని క్రోడీకరించుకుని...ఏఐ ద్వారా విశ్లేషించి మొంథా తుఫాన్ కదలికలను కచ్చితంగా తెలుసుకోగలిగింది రాష్ట్రప్రభుత్వం. తద్వారా సహాయక చర్యలనూ వేగంగా చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ ద్వారా 72 గంటల ముందే తుఫాన్ కదలికల్లో వచ్చిన మార్పులను గుర్తించగలిగారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకో గలిగారు.. అలాగే ఆయా ప్రాంతాల్లోని ప్రజలనూ అలెర్ట్ చేయగలిగారు. గాలుల వేగాన్ని అంచనా విషయంలో కచ్చితమైన సమాచారం రావడంతో... ఆయా ప్రాంతాల్లో ముందస్తుగానే చర్యలు తీసుకోవడానికి ఆస్కారం లభించింది. దీని ద్వారా ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగింది ప్రభుత్వం.

## అలారంలా పని చేసిన అలెర్ట్ మెకానిజం

ఇక వివిధ వ్యవస్థల ద్వారా రియల్ టైములో సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం... ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రజ లకు కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలి. విపత్తులకు సంబంధించిన సమాచారం ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. ఈ విషయంలో ప్రభుత్వం టెక్నాలజీని పూర్తి గా వినియోగించుకుంది. వాస్తవాలను ప్రజలకు నేరుగా చేరవేయగలిగింది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అధికారులకు 1.1 కోట్లకు పైగా సందేశాల ను ప్రభుత్వం పంపింది. ఫిర్యాదులు స్వీకరించడం.. ఫీడ్ బ్యాక్ తీసుకోవడానికి కూడా ప్రత్యేక వ్యవస్థలు పని చేశాయి. మనమిత్ర సుమారు 12,000కు పైగా ఫిర్యాదులు అందాయి. వీటిని క్షేత్రస్థాయిలో ఉన్న ప్రభుత్వ యంత్రాంగం పరిష్కరించింది. ఐవీఆర్ఎస్ సర్వేలు, మీడియా, సోషల్-మీడియా మానిటరింగ్ ద్వారా అధికారులు ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఇదే సమ యంలో తప్పుడు సమాచారం వ్యాప్తిని నివారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

## డ్రోన్‌లు, సీసీటీవీ, వాహనాల లైవ్ ట్రాకింగ్

ఏరియల్ సర్వేలు, వరద మ్యాపింగ్, రియల్ టైమ్ డేటా సేకరణకోసం 602డ్రోన్‌లను అందుబాటులో ఉంచారు. 14,770 సీసీటీవీ కెమెరాలను ఆర్టీజీఎస్ నెట్‌వర్క్‌కు అనుసంధానించారు. 24 గంటల పాటు క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను అంచనా వేయగలి గారు. అలాగే ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే.. వాటి ని త్వరగా గుర్తించగలిగారు. ఇక మెషినరీ ట్రాకింగ్ యాప్ ద్వారా జేసీబీలు, క్రేన్‌లను లైవ్ ట్రాక్ చేయడానికి వీలు కలిగింది. అలాగే రోడ్‌బ్లాక్‌లు, వరద ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలు ఉన్న చోట జేసీబీలు, క్రేన్లను తరలించేలా చర్యలు తీసుకోగలిగారు. ఇక అన్ని విభాగాల నుంచి వచ్చిన లైవ్ డేటాను అను సంధానిస్తూ... సైక్లోన్ మానిటరింగ్ డాష్‌బోర్డ్ ఏర్పాటు చేశారు. ఇంటిగ్రేటెడ్ జీఐఎస్ మ్యాపింగ్ ద్వారా రోడ్లు, ఆసుపత్రులు, సహాయక కేంద్రాలు, కీలకమైన మౌలిక సదుపాయాలు ఎక్కడున్నాయనే సమాచారాన్ని సేకరించగలిగారు.

## గ్రౌండ్ నెట్ వర్క్... గ్రౌండ్ రియాల్టీ...

5,803 గ్రామ, వార్డు స్థాయిలో కూడా కమాండ్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసుకోగలిగింది. క్షేత్ర స్థాయి సిబ్బంది ద్వారా 2 కోట్లకు పైగా ప్రజలకు సేవలందించే ఏర్పాట్లను ముందుగానే చేసుకోగలిగింది. ఈ క్షేత్ర స్థాయి వ్యవస్థ ద్వారా బ్యాకప్ పవర్, సహాయక సామాగ్రిని ఆయా కేంద్రాల్లో ముందుగానే ఉంచారు. ముఖ్యంగా 1,742 మంది గర్భిణులను సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడంలో గ్రౌండ్ లెవల్ నెట్ వర్క్ బాగా ఉపయోగపడింది.

తుఫాన్ సమయంలో అంతర్-ఏజెన్సీ సమన్వయాన్ని బలోపేతం చేస్తూ, ఒక బలమైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కొనసాగింది. 2,973 పోర్టబుల్ వైర్‌లెస్ సెట్‌లు, డీజీ సెట్‌లు మౌంటెడ్ రేడియోలతో ఆర్టీజీ సెంటర్ నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఉంది.

## కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం...

ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ఐఎండీ, ఎన్‌డీఎంఏ, ఎంహెచ్ఏలతో నిరంతరం కో-ఆర్డినేట్ చేసుకుంటూ ఆర్టీజీఎస్ సహా ఇతర విభాగాలు పని చేశాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నెల్లూరులోని సంగం బ్యారేజ్ సమీపంలో చిక్కుకున్న పడవను చాకచక్యంగా లాగడం వంటి క్లిష్టమైన రెస్క్యూ మిషన్లను చేపట్టాయి. భారతదేశంలో మొట్టమొదటిదైన ఎన్‌డీఎంఏ సెల్ బ్రాడ్‌కాస్ట్ వైబ్రేషనల్ అలర్ట్ సేవను మన రాష్ట్రం వినియోగించుకుంది. ఎనర్జీ డిపార్ట్‌మెంట్ ఫీడర్‌లు సబ్‌స్టేషన్‌లను రియల్ టైములో పర్యవేక్షణ చేశాయి. శాటిలైట్ చిత్రాల సాయంతో ముంపు నివారణకు చర్యలు తీసుకున్నారు. ఈ విధంగా పూర్తి స్థాయి సాంకేతికతతో ప్రభుత్వం మొంథా తుఫాన్ సహాయక చర్యలను చేపట్టింది. భవిష్యత్తులో ఎలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినా... ప్రస్తుతం ఏర్పాటు చేసుకున్న వ్యవస్థల ద్వారా నష్టనివారణా చర్యలు చేప్టటడానికి రోడ్ మ్యాప్ సిద్ధమయింది.







సినీ హీరో నారా రోహిత్ - శిరీషల వివాహం హైదరాబాద్‌లో గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రోహిత్ వివాహ వేడుకలను గత నాలుగు రోజులుగా నారా కుటుంబం అత్యంత వైభవంగా నిర్వహిస్తోన్న విషయం తెలిసిందే. అక్టోబర్ 30 గురువారం రాత్రి 10:35 గంటలకు హైదరాబాద్ అజీజ్‌నగర్‌లోని ద వెన్యూ కన్వెన్షన్‌లో జరిగిన వివాహ వేడుకతో రోహిత్, శిరీష ఒక్కటయ్యారు. తన సోదరుడు, కీ.శే నారా రామ్మూర్తి నాయుడి కుమారుడు నారా రోహిత్ వివాహ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సతీమణి భువనేశ్వరి.. వధూవరులు రోహిత్, శిరీషలను నిండు మనసుతో ఆశీర్వదించి.. వివాహ కార్యక్రమాన్ని ఆనందంగా తిలకించారు.







# ఇది రైతు పక్షపాత ప్రభుత్వం

- నష్టపోయిన అందరినీ ఆదుకుంటాం
- యుద్ధ ప్రాతిపదికన పంటనష్టం అంచనా... పరిహారం చెల్లింపు
- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టీకరణ
- పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లో పంట నష్టాన్ని పరిశీలించిన మంత్రి



పెనమలూరు/పామర్రు (చైతన్యరథం): మొంథా తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లుగా అంచనా వేసామని, ఇందులో ఒక్క కృష్ణా జిల్లాలోనే 46వేల హెక్టార్లలో నష్టం కలిగిందని చెప్పారు. ఈ జిల్లాలో దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. గురువారం కృష్ణా జిల్లా పెనమలూరు, పామర్రు నియోజకవర్గాలలో స్థానిక ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజాలతో కలసి పర్యటించిన మంత్రి అచ్చెన్నాయుడు... మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న కంద, అరటి, వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఆవేదన తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు సన్నద్ధత మూలంగా మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కోగలిగామన్నారు. పక్కా ప్రణాళికతో నష్టం తీవ్రతను తగ్గించాం. సుదీర్ఘ పాలనానుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపు కారణంగానే తగినన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. వీడియో కాన్ఫరెన్సులు, ఆర్టీజీఎస్ ద్వారా 24 గంటలు పరిస్థితులను పర్యవేక్షిస్తూ.. అటు యంత్రాంగాన్ని, ఇటు గ్రామ స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేశాం. ఈ విపత్తులో కౌలు రైతులు కూడా నష్టపోయారు, వారిని కూడా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ పంటలకు రూ.829 కోట్లు, ఉద్యాన రంగంలో రూ.39 కోట్లు, సెరీకల్చర్ రూ.65 కోట్లు, ఆక్వా రంగంలో రూ.1,270 కోట్లు, పశుసంవర్ధక శాఖలో రూ.71 లక్షలు నష్టం వాటిల్లిందని మంత్రి తెలిపారు. తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయని వివరించారు. త్వరలోనే నష్టం అంచనాలను తయారు చేసి కేంద్రానికి పంపిస్తామని స్పష్టం చేశారు. గతంలో తుపాను ప్రభావం తగ్గిన వారం రోజుల వరకూ కోలుకునే పరిస్థితి ఉండేది కాదు. తుపాన్లు, వర్షాలను ఆపలేం కానీ అప్రమత్తత, ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉందని అన్నారు.

## రైతులకు తగిన న్యాయం చేస్తాం

తుపాను ప్రభావంతో చేతికొచ్చిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వరి, వాణిజ్య పంటలు విస్తృతంగా నష్టపోయాయని పేర్కొన్నారు. రైతులకు తగిన న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. వ్యవసాయ, హార్టికల్చర్ శాస్త్రవేత్తలను రంగంలోకి దించి, మిగిలిన పంటలను కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయి సర్వే పూర్తవుతుందని, కేంద్రం సహకారంతో రైతులకు తగిన నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కాలంలో 20 వేల రూపాయల నష్టపరిహారాన్ని 17 వేల రూపాయలకు తగ్గించిందని, అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ నష్టపరిహారాన్ని 20 వేల నుండి 25 వేల రూపాయలకు పెంచామని గుర్తుచేశారు. కేంద్రం నిర్ణయించిన దానికంటే అధికంగా పరిహారం అందజేస్తున్నామని చెప్పారు. రైతులు మళ్లీ పంటలు వేసేందుకు సిద్ధమైతే విత్తనాలను అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 95 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని, మిగిలిన 5 శాతం కూడా నవంబర్ 12 లోపు పూర్తి చేస్తామని చెప్పారు. రైతులకు ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలనే సంకల్పంతో ఉన్నామని అన్నారు. ప్రతి గ్రామం, ప్రతి జిల్లాలో నష్టపోయిన పంటల వివరాలను న్యాయబద్ధంగా నమోదు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ముందస్తు ఆలోచనలతోనే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామనీ, కాని పంట నష్టం జరిగినదని తెలిపారు. బుడమేరు వరద బాధితులకు 15 రోజుల్లో పరిహారం అందజేశామని, రైతుల పట్ల ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# పరకామణి కేసును ఎందుకు నీరుగార్చారు?

- నిందితులతో రాజీకి ఎలా అంగీకరించారు
- మేజిస్ట్రేట్ అందుకు ఎలా ఒప్పుకున్నారు
- జగన్‌రెడ్డి, డీజీపీనా..ఎవరు ఒత్తిడి తెచ్చారు
- స్వామి వారి సొమ్ము కొట్టేయడానికి కుట్రలా
- నిందితులకు పోలీసుల రాచమర్యాదలా
- భూమన తల నరుక్కోవద్దు..నిజాలు చెప్పాలి
- దర్యాప్తు అధికారిని సస్పెన్షన్ చేయాలి
- పునర్విచారణకు హైకోర్టులో అప్పీల్ చేయాలి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య



మంగళగిరి (చైతన్యరథం): తిరుమల తిరుపతి దేవస్థానం 2023లో జరిగిన పరకామణి దొంగతనం కేసు దర్యాప్తును సునిశితంగా పరిశీలిస్తే ఇది కేవలం దొంగతనం కాదని ఒక పెద్ద కుట్రలా కనిపిస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామ య్య ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కేసు దర్యాప్తులో అడుగడుగునా తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. దీనికి నాటి చైర్మన్, టీటీడీ అధికారులు, ఈవో బాధ్యులని స్పష్టం గా తెలుస్తుందని పేర్కొన్నారు. స్వామివారి సొమ్ము తింటూ స్వామివారికి ఇంత అన్యాయం చేస్తారా? ఈ కుట్ర రాష్ట్ర ప్రజలం దరికీ అర్థమవుతోందన్నారు. గౌరవ హైకోర్టు ఉన్నా ఈ కుట్రను వెలికితీయడానికి సునిశితంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దొంగతనం జరిగిన తర్వాత 29-04-2023 రాత్రి 11 గంటలకు విజిలెన్స్ అధికారి సతీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు తిరుపతి టూటౌన్ ఎస్ఐ క్రైమ్ నెంబర్ 19/2023గా ఐపీసీ 379, 381 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే కోట్లాది రూపాయలు దొంగతనం చేసిన పరకామణి సూపర్‌వైజర్, ముద్దా యి రవికుమార్‌పై 10 ఏళ్ల శిక్షపడే 409 ఐపీసీ (నమ్మక ద్రోహం) సెక్షన్ ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ కేసులో మొదటి నుంచే తప్పటడుగులు పడడానికి ఆనాటి ఈవో ధర్మారెడ్డా, చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డా ఎవరు ఆదేశించారు? అని నిలదీశారు. స్వామివారి దగ్గర దొంగతనం జరిగితే ఎస్పీ, డీఎస్పీ, సీఐ వంటి ఉన్నతాధికారులు పరుగులు తీయాలి.. కానీ వారెవరూ 409 ఐపీసీ ఎందుకు వేయలేదని ప్రశ్నించకపోవడం చూస్తుంటే అంద రూ ఇందులో పాలుపంచుకున్నారా అనే అనుమానం కలుగు తుం దన్నారు. ముద్దాయి రవికుమార్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చి ఇంట రాగేషన్ చేయకుండా మరుసటిరోజు రాచమర్యాదలతో 41ఏ సీఆర్‌పీసీ నోటీసులు ఇచ్చి సగర్వంగా కాఫీ, టీ, టిఫిన్ ఇచ్చి వెళ్లిపోమని పంపడం అత్యంత దారుణమని మండిపడ్డారు. ఇలా చేయడానికి ఎవరు ఆదేశించారు? అని ప్రశ్నించారు. దర్యాప్తు చేయకుండానే, ఎఫ్ఐఆర్ నమోదైన నెల రోజుల్లోనే (31-05-2023న) తిరుపతి రెండో జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు ఛార్జ్ షీట్ వేశారు. నాటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అత్రుత దీనికి కారణమని ఆరోపించారు. ఛార్జ్‌షీట్ వేసిన రోజే న్యాయ మూర్తి దానిని పరిగణలోకి తీసుకుని సీసీ నెంబర్ ఇవ్వడం విచిత్ర మని, ఈ విషయంలో మేజిస్ట్రేట్ తప్పుడు అడుగులు వేశారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టును కోరారు.

## రాజీకి ఎలా అంగీకరించారు?

జూన్ 1న ఫిర్యాది సతీష్‌కుమార్, ముద్దాయి రవికుమార్ చెట్టపట్టాలేసుకుని కోర్టుకు వెళ్లి ఈ కేసు రాజీ పడుతున్నామని జాయింట్ మెమో ఇచ్చారు. అయితే ఈ కేసు రాజీ పడటానికి ఫిర్యాదు చేసిన సతీష్‌కుమార్‌కు ఏ మాత్రం అర్హత లేదు. స్వామి వారి ఆస్తికి యజమాని స్వామివారేనని, దానికి సంరక్షకులు టీటీడీ బోర్డు మాత్రమే. కానీ బోర్డు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఫిర్యాదు చేయకుండా సంబంధం లేని వ్యక్తి రాజీ పడతానంటే మేజిస్ట్రేట్ ఎలా అంగీకరించారని ప్రశ్నించారు.

కోట్లాది రూపాయలు దొంగ తనం చేసిన వ్యక్తి లోక్ అదాలత్‌లో రాజీ పడటం న్యాయానికే సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ముద్దాయి రవికుమార్ తన, తన భార్య పేరిట ఉన్న రూ.14.5 కోట్ల విలువైన ఆస్తులను స్వామి వారికి బహుమతిగా తిరిగి ఇవ్వడం మరో విడ్డూరం. ఈ ఆస్తులు దొంగతనం ద్వారా సంపాదించినవా కాదా అని దర్యాప్తు అధికారి విచారించకుండానే బహుమతిని అంగీకరించారు. అంతేకాక రూల్ 159 నిబంధన ప్రకారం గిఫ్ట్ తీసుకునే ముందు 30 రోజుల ముందు పత్రికా ప్రకటన చేయకుండా, నాటి చైర్మన్ ఒక్కడే సంతకం పెట్టి ఈ గిఫ్ట్‌ను ఎలా ఆమోదించారని ప్రశ్నించా రు. ఇది వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డిల సొత్తా లేక కోట్లాది మంది ఆరాధించే వెంకటేశ్వరస్వామి సొత్తా అని నిలదీశారు. స్వామివారి సొమ్ము కొట్టేయడానికి ఇది ఒక కుట్ర అని అందుకే హైకోర్టు సీఐడీతో దర్యాప్తు చేయమని చెప్పిం దన్నారు. ఈ కేసులో అడుగడుగునా పాలనాపరమైన పద్ధతులు, చట్టబద్ధమైన నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి దర్యాప్తును కుక్కలు చింపిన విస్తరిలా చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ గిరిధర్ రెడ్డి అడిగిన వివరణకు ఇదంతా పోలీసుల "ఒత్తిడి" వల్ల చేయాల్సి వచ్చిందని టీటీడీ సమాధానం ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటి? ఆ ఒత్తిడి నాటి డీజీపీదా? పోలీసులదా? లేక ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డిదా? అని ప్రశ్నించారు. ఒక్కరోజు కూడా జైలుకు పోకుం డా ముద్దాయి రవికుమార్‌ను సగర్వంగా బయటికి తీసుకొచ్చింది టీటీడీ బోర్డు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అని ప్రశ్నించారు. తిరుపతి లోక్ అదాలత్ ఇచ్చిన తీర్పును పక్కనపెట్టి ఈ కేసు పునర్విచారణ జరిపించాలని టీటీడీ హైకోర్టులో అప్పీల్ చేయాలని కోరారు. సీఐడీ ఈ కేసును ప్రతిష్టాత్మకంగా దర్యాప్తు చేసి తప్పు చేసిన వారు ఎంతటివారైనా (చైర్మన్, ఈవో, ఇతర ఉన్నతాధికారులు) వదల కుండా చట్టానికి పట్టించాలని డిమాండ్ చేశారు. ఆ దర్యాప్తు అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని, అతనికి పోలీసు అధికా రిగా కొనసాగే హక్కు లేదన్నారు. ఏసీబీ కూలంకషంగా దర్యాప్తు చేసి అసలు ముద్దాయిలను చట్టానికి పట్టించడం ద్వారా స్వామి వారి భక్తుల విశ్వాసం సన్నగిల్లకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. భూమన కరుణాకర్‌రెడ్డి తల నరుక్కోవద్దు పరకామణి కేసును ఎందుకు ఇంత నీరుగార్చారో, దొంగతనం గురించి నిజాలు చెబితే చాలు అని కోరారు.

# నష్టపోయిన రైతాంగానికి సత్వర పరిహారం

- త్వరలోనే తడిచిన పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తాం
- సీఎం చంద్రబాబు అప్రమత్తతో తప్పిన పెను ముప్పు
- దెబ్బతిన్న విద్యుత్ కనెక్షన్లు పూర్తిగా పునరుద్ధరణ
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి/పర్చూరు(చైతన్యరథం): మొంథా తుఫానుతో నష్టపో యిన రైతాంగానికి సత్వర పరిహారం అందేలా చర్యలు తీసుకుం టామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో సహచర మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పర్చూరు నియోజక వర్గ పరిధిలోని అన్నంబట్లవారి పాలెం, గర్నపూడి, తిమ్మరాజు పాలెం, అగ్రహారం, పర్చూరు, పర్చూరు టౌన్‌లోని నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అద్దంకి నియోజకవర్గ పరిధి జే.పంగులూరు మండలంలోని బూదవాడ, కోటపాడు, కొండమూరు గ్రామాల్లోని పంట పొలాలను అధికారులతో కలిసి తిరిగారు. పొలాలకు వెళ్లి తుఫాన్‌తో నష్టపోయిన వరి, వేరుశనగ, వంగ, పత్తితో పాటు పలు ఉద్యానవన పంటలను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పంటలకు జరిగిన నష్టాన్ని అధ్యయనం చేసి యుద్ధ ప్రాతిపదికన నష్టం అంచనా నివేదిక సమర్పించాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రియల్ టైంలో పర్యవేక్షించి అధికార యంత్రాంగంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలను అప్రమత్తం చేయడంతో పెనుముప్పు తప్పిందని పేర్కొన్నారు. వాగులు, వంక లు పొంగి పొర్లడంతో పంటలు నాశనం అయ్యాయని, రైతాంగం తీవ్రంగా నష్ట పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలు, పొలాలు గడిచిన నాలుగు రోజులూ తుఫాను వరదతో నిండి పోయాయని తెలిపారు. అమ్మకాలు చేయడానికి ఇళ్లలో ఉంచిన పొగాకు తడిచిపోయిందని చెప్పారు. ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి త్వర లోనే తడిచిన పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తామని రైతులకు మంత్రి గొట్టిపాటి భరోసా ఇచ్చారు. బాధిత రైతులతో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి.. నష్టపరిహారం నివేదికను వెంటనే ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు. అదే విధంగా సాధ్యమైనంత త్వరగా తుఫాను నష్టానికి సంబంధించి పరిహారం రైతులకు అందిస్తామ న్నారు. అద్దంకి పట్టణంలోని నాలుగవ వార్డులో పర్యటించిన మంత్రి గొట్టిపాటి అక్కడి ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమ స్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వంలో సరిగా పూడికలు తీయకపోవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయని మండిపడ్డారు. పల్నాడు, అద్దంకి వంటి ఎగువ ప్రాంతాల నుంచి పర్చూరు, బాపట్ల వంటి దిగువ పల్లపు ప్రాంతాలకు వరద నీరు చేరి పంట పొలాలను ముంచెత్తాయని తెలిపారు. బాపట్ల, ప్రకాశం, మచిలీపట్నంతో పాటు ఉత్తరాంధ్రలోని ప్రాంతాలు తుఫానుతో పెద్దఎత్తున నష్ట పోయాయని ఆయన పేర్కొన్నారు. అందుకే క్షేత్రస్థాయిలో అధికా రులతో పర్యటించి నష్టం అంచనా నివేదిక రూపొందిస్తు న్నట్లు వెల్లడించారు. చాలా ప్రాంతాల్లో కూలిపోయిన చెట్లను తొలగించి, విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గృహ అవసరాలకు పూర్తిస్థాయిలో ఇప్పటికే విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని పేర్కొన్నారు. వ్యవసాయ, ఆక్వా, ఇతర అవసరాలకు సంబంధించిన కనెక్షన్లను కూడా గురువారం సాయంత్రానికి చాలా వరకు సరి చేశామని వివరించా రు. ఈ కార్యక్రమంలో అధికారులు, నేతలు పాల్గొన్నారు.

# రాష్ట్ర పండుగగా భక్త కనకదాస జయంత్యుత్సవం

**వచ్చే నెల 8న కల్యాణదుర్గంలో నిర్వహణ**
**బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
**బీసీ హాస్టళ్లకు రూ.60 కోట్ల విడుదలపై హర్షం**
**ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు**

అమరావతి(చైతన్యరథం): సామాజిక తత్వవేత్త, స్వరకర్త భక్త కనకదాస జయంతిని వచ్చే నెల ఎనిమిదో తేదీన ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్లు బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో నిర్వహించే ఈ జయంత్యుత్సవానికి మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ మేరకు గురువారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక తత్వవేత్త గా, స్వరకర్తగా భక్త కనకదాస తన కీర్తనలు, రచనలతో సమాజం లో అసమానతలపైనా, కుల వ్యవస్థపైనా ప్రజల్లో చైతన్యం తీసు కొచ్చారన్నారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు కనకదాస చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. అటువంటి మహనీయుని జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం ఆనందకరం. గతేడాది అనంత పురంలో భక్త కనకదాస రాష్ట్ర స్థాయి జయింతిని నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఏడాది అనంతపురం జిల్లా కల్యా ణదుర్గంలో రాష్ట్ర స్థాయి భక్త కనకదాస జయంతిని నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రెండు రోజుల్లో కూటమి ప్రభుత్వం విడుదల చేయనుందని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ భక్త కనకదాస జయంతి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు**

అసంపూర్తిగా నిలిచిపోయిన బీసీ హాస్టళ్ల, గురుకులాల నిర్మా ణాలకు కూటమి ప్రభుత్వం రూ.60 కోట్లు మంజూరు చేయడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం బీసీ హాస్టళ్లను గాలికొదిలేసిందన్నారు. డైట్, కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించకపోగా, కనీసం హాస్టల్ మరమ్మతులకు రూపాయి కూడా ఇవ్వలేదు. బీసీ బిడ్డల విద్యకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే హాస్టల్ విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నాం. తల్లికి వందనం పథకంలో భాగంగా ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికీ ఆ పథకాన్ని వర్తింపజేశాం. హాస్టళ్లలో భద్రతకు సీసీ కెమెరాలు, పరిశుద్ధమైన తాగునీటి కోసం వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తు న్నాం. ఎప్పటికప్పుడు డైట్, కాస్మొటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని వివరించారు. గురుకుల పాఠశాలల్లో పే ఫోన్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో విద్యార్థులకు ఫోన్‌లో మాట్లాడే అవకాశం కల్పించామన్నారు. బీసీ హాస్టళ్ల నిర్మాణాలకు రూ.60 కోట్లు మంజూరు చేయడం ద్వారా సీఎం చంద్రబాబు బీసీ పక్షపాతి అని మరోసారి రుజువైందని తెలిపారు.



## సంగం బ్యారేజీకి తప్పిన ముప్పు

**- తీవ్రంగా శ్రమించి భారీ బోటును బయటకు తీసిన సిబ్బంది**



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు జిల్లాలో లంగరు తెగిపోయి సంగం బ్యారేజీ గేట్ల దిశగా వేగంగా వెళు తున్న 35 టన్నుల భారీ బోటును నదీ ప్రవాహానికి ఎదురెళ్లి మరీ పక్కకు తీసుకు రావటంతో పెను ప్రమాదం తప్పింది. పెన్నా నదిలో ఇసుక తవ్వకాల కోసం తెప్పించిన మూడు బోట్లను రెండురోజుల క్రితం తాడుతో బోట్లను కట్టేశారు. వర్షాలకు నది ప్రవాహం పెరిగి తాళ్లు తెగిపోయాయి. దీంతో మూడు బోట్లు కొట్టుకుపోయాయి. బుధవారం రెండు పడవలను గట్టుకు తరలించిన అధికారులు, సిబ్బంది.. గురువారం 35 టన్నుల బరువున్న భారీ బోటును కూడా బయటకు తీశారు. ఆ పడవ అలాగే కిందకు వెళ్తే... పెన్నా వారధి గేట్లకు ఢీకొని భారీ నష్టం వాటిల్లేదని అధికారులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల అక్కడికి చేరుకొని బోటును ఒడ్డుకు చేర్చే ప్రణాళికను అమలుచేశారు. 30 మంది ఎస్డీఆర్ఎఫ్ సభ్యులు, 30 మంది ఎన్డీఆర్ఎఫ్ సభ్యులు, 100 మంది పోలీస్ సిబ్బంది, కృష్ణపట్నం పోర్టు గస్తీ బృందం, ఫైర్, ఇరిగేషన్ అధికారులు... అందరూ ఎంతో శ్రమించి యుద్ధప్రాతిపదికన ఆ బోటును ఒడ్డుకు చేర్చారు. సంగం బ్యారేజీకి భారీ ముప్పును తప్పించారు. పెన్నా నది ప్రవాహానికి ఎదురెళ్లి మరీ పడవను పక్కకు తీసుకువచ్చారు.

## ఇండియా మారిటైమ్ వీక్..
## విశాఖ పోర్టు భారీ ఒప్పందాలు




విశాఖపట్నం (చైతన్యరథం): ముంబయిలో జరుగుతున్న ఇండియా మారిటైమ్ వీక్-2025లో విశాఖ పోర్టు భారీ ఒప్పందాలు కుదుర్చుకుంది. ముంబయి వేదికగా అక్టోబరు 27 నుంచి 31 వరకు జరుగుతున్న ఇండియా మారిటైమ్ వీక్-2025.. భారతదేశ సముద్ర రంగ సామర్థ్యాన్ని, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ప్రతిబింబించే ప్రధాన వేదికగా నిలుస్తోంది. ఈ వేడుకలో 100కి పైగా దేశాల ప్రతినిధులు పాలుపంచుకుంటున్నారు. పోర్టుల్లో మౌలిక సదుపాయాలు, షిప్ బిల్డింగ్, అంతర్గత జలమార్గాలు, గ్రీన్ షిప్పింగ్ వంటి రంగాల్లో భారత్‌ను అంతర్జాతీయ నౌకాయాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్చలు, సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి దుగరాజపట్నంలో మేజర్ పోర్టు కమ్ షిప్ బిల్డింగ్ అండ్ షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు రూ. 29,662 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయి. ఇది భారత ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యానికి బలాన్ని చేకూర్చుతుంది. ఈ మేరకు విశాఖపట్నం పోర్టు అథారిటీ ప్రకటన విడుదల చేసింది. ఇండియా మారిటైమ్ వీక్-2025లో విశాఖపట్నం పోర్టు మొత్తంగా రూ.39,216 కోట్లకు పైగా ఒప్పందాలను కుదుర్చుకొని విలువైన పెట్టుబడులను ఆకర్షించింది. ఇవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధికి, ఉపాధి సృష్టికి దోహదం చేయడమే కాకుండా, నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ, మారిటైమ్ ఇండియా విజన్-2030, జీరో పొల్యూషన్ 2070 లక్ష్యాల సాధనలో కీలక పాత్ర పోషించనున్నాయని విశాఖ పోర్టు అథారిటీ తెలిపింది.

# యుద్ధప్రాతిపదికన పంటనష్టం అంచనా.. పరిహారం

- నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం
- ముందస్తు చర్యలతో నష్టం తీవ్రతను తగ్గించాం
- 1.16 లక్షల మందిని పునరావాసానికి తరలించాం
- శిబిరాల్లో ఉన్న వారికి ఉచితంగా నిత్యావసరాలు
- దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు పనులు ప్రారంభిస్తాం
- గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- ఇంటికి వెళ్లే ముందే బాధితులకు ఆర్థిక సాయం
- అవనిగడ్డలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్
- తుఫాన్ ప్రభావిత ప్రాంతాలో పంటల పరిశీలన



అవనిగడ్డ (చైతన్యరథం): మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామ'ని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.38 లక్షల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని, ఇందులో ఒక్క కృష్ణా జిల్లాలోనే 46వేల హెక్టార్లలో నష్టం కలిగిందని చెప్పారు. ఈ జిల్లాలో దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని ప్రాథ మిక అంచనాకు వచ్చామన్నారు. నష్టపోయిన ప్రతిఒక్క రైతును ఆదుకుంటామని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. గురువారం కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఆవేదన తెలుసుకున్నారు. అనంతరం కృష్ణా జిల్లా అధికారులు అవనిగడ్డలో తుఫాన్ నష్టంపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ముందస్తు సన్నద్ధత మూలంగా మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కోగలిగాం. పక్కా ప్రణాళికతో నష్టం తీవ్రతను తగ్గించాం. సుదీర్ఘ పాలనానుభవం ఉన్న చంద్రబా బు ముందు చూపు కారణంగానే తగినన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. వీడియో కాన్ఫరెన్స్‌లు, ఆర్టీజీఎస్ ద్వారా 24 గంటలు పరిస్థితు లను పర్యవేక్షిస్తూ.. అటు యంత్రాంగాన్ని, ఇటు గ్రామ స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేశాం. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా లక్ష 16 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం. ఈ విపత్తులో కౌలు రైతులు కూడా నష్టపోయిన విషయం నా దృష్టికి వచ్చింది. వారిని ఆదుకొనే అంశాన్ని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళతాను.

### అంటు వ్యాధులకు సూపర్ క్లోరినేషన్, సూపర్ శానిటేషన్

తుపాను అనంతర ఉపశమన చర్యలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాం. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సుమారు 274 కిలోమీటర్ల మేర రహదారులు తుఫాన్ దాటికి దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దెబ్బతిన్న అన్ని రోడ్లను శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించాం. పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడంతోపాటు అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో సూపర్ శానిటేషన్.. సూపర్ క్లోరినేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. జిల్లాల వారీగా పారిశుద్ధ్య సిబ్బందిని బృందాలుగా విభజించి పారిశుద్ధ్యం మెరుగు పర్చే చర్యలు మొదలు పెట్టాం. 1,583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితం కాగా, మొత్తం 21,055 మంది సిబ్బందిని పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్నాం. తాగునీటి సరఫరా వ్యవస్థకు ఇబ్బంది ఏర్పడిన చోట్ల ప్రయత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం.

### ఇళ్లకు వెళ్లే ముందే ఆర్థిక సాయం

మొంథా ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస శిబిరాల్లో ఉన్న వారికి 25 కిలోల బియ్యాన్ని, ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యం ఇవ్వాలని నిర్ణయించాం. కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్ ప్యాకెట్, కిలో ఉల్లిపాయలు, 1 కిలో బంగాళాదుంపలు, కిలో పంచదార కూడా కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. శిబిరాల్లో ఉన్న వారికి ఇళ్లకు వెళ్లే ముందే ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున ఇస్తున్నాం. ఒక్కో కుటుంబానికీ గరిష్ఠంగా రూ.3 వేలు చెల్లించనున్నాం. తుపాను వల్ల సంభవించిన నష్టంపై ప్రాథమిక నివేదిక రాగానే కేంద్ర సహకారం కోరుతాం. కోడూరు మండల పరిధిలో సముద్రం కట్టపై దెబ్బ తిన్న అవుట్ ఫాల్ స్లూయిజ్ కొత్తగా నిర్మించడానికి నాబార్డ్ సాయం తీసుకుంటాం. ఎదురుమొండి దీవుల్లో సముద్ర కోతకు గురై దెబ్బ తిన్న ఎదురుమొండి–గొల్లమంద రహదారి నిర్మాణానికి రూ.13.08 కోట్ల కేటాయించామని, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని, దీని ద్వారా ఐదు గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తీరనున్నాయని తెలిపారు. ఈ పర్యటనలో మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కృష్ణా జిల్లా స్పెషల్ ఆఫీసర్, టూరిజం శాఖ ఎండీ శ్రీమతి అమ్రపాలి, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తదిత రులు పాల్గొన్నారు.

### కృష్ణా, గోదావరి ఉపనదులకు భారీ వరద..

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి



- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం
- ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా వరద ప్రవాహాన్ని అధికారులతో కలసి పరిశీలించిన మంత్రి
- తుపాను నష్ట నివారణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు
- వైసీపీ ఫేక్ ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు వినతి

అమరావతి (చైతన్యరథం): మొంథా తుపాను అనంతరం ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి ఉపనదులకు భారీ వరద వస్తుండటంతో అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. గురువారం జలవన రుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహా మూర్తి, కృష్ణాడెల్టా చీఫ్ ఇంజనీర్ రాంబాబు. ఇతర ఇరిగేషన్ అధికారులతో కలసి విజయవాడ ప్రకాశం బ్యారేజ్ దగ్గర కృష్ణానది వరద ప్రవాహాన్ని మంత్రి పరిశీలించారు. ఎగువ నుండి వస్తున్న వరదలను ఎప్పటికప్పుడు ఇరిగేషన్ శాఖ సమీక్షిస్తోందని, నాగార్జున సాగర్ నుండి విడుదల చేస్తున్న 2లక్షల క్యూసెక్కుల వరద నీటిని 1లక్ష క్యూసెక్కులకు తగ్గించగా, పులి చింతల ప్రాజెక్ట్ నుండి ఉదయం 4.85 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేయగా, దానిని మధ్యాహ్నానికి, 3.85 లక్షలకు తగ్గించాం అని తెలిపారు.

మున్నేరు ఉధృతితో పాటు, నాగార్జున సాగర్, పులిచింతల, నుండి వచ్చే వరదతో ప్రకాశం బ్యారేజికి దాదాపు 6 లక్షల నుండి 6.5లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చే అవకాశం ఉన్నందును దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు.

కృష్ణాడెల్టా పరిధిలో అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, మందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం,అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో వాగులు పొంగుతుండంతో ఆయా జిల్లాల కలెక్టర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

గుండ్లకమ్మకు వస్తున్న వరద నీరు, తగ్గుతుండటంతో 70 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో గురువారం కురిసిన అధిక వర్షాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వాగుల గట్లు, కాల్వ గట్లు పట్ల అప్రమతంగా ఉండాలని ఆదేశించామన్నారు. తుపాను కారణంగా కురిసిన వర్షాలు, వరదల పట్ల ప్రభుత్వం అన్నిరకాల ముందస్తు జాగ్రత చర్యలు చేపట్టి, ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటుంటే వైసీపీ మాత్రం సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోందని, ప్రజలు దుష్ప్రచారాన్ని నమ్మవద్దని మంత్రి రామానాయుడు హితవు పలికారు.

## నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

- రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరిస్తాం
- గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- మచిలీపట్నం రూరల్ మండలంలో పర్యటన



మచిలీపట్నం (చైతన్యరథం): తుఫానుతో పంట నష్టపోయి ఆందోళనలో ఉన్న ప్రతి రైతును ఆదుకుంటామని గనులు, భూగ ర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. మచిలీపట్నం రూరల్ మండలంలోని భోగిరెడ్డిపల్లె, యాదర, నెలకుర్రు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను ఆర్టీసీ చైర్మన్ కొనకల నారాయణరావుతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకు న్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యత గురించి, సమస్య ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వర్షాలతో గ్రామాల్లో రోడ్లు, విద్యుత్ లైన్లు, డ్రైన్లు దెబ్బతిన్నాయని తెలియజేయడంతో వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా చిన్న సన్నకారు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం నుంచి కావాల్సిన మేరకు పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అధికారులు కూడా పంట నష్టం అంచనా విషయంలో ఉదా రంగా వ్యవహరించాలని సూచించారు. తుఫాన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రాణనష్టాన్ని నివారించినా పంట నష్టాన్ని అడ్డుకోలేకపోయాం. కానీ పరిహారం విషయంలో ఉదారంగా న్యాయం చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులకు 90 శాతం వరకు నష్టపరిహారం దక్కేలా చూస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఇప్పటికే తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేశారని, పరిహారం విషయంలో ఉదారంగా ఉన్నారన్నారు. అనంతరం అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండలంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో కలిసి తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

## భగవద్గీతపై తన వ్యాఖ్యలకు వైసీపీ దుష్ప్రచారం

- రాజ్యాంగంతో దళితుల ప్రమాణాలు మెరుగనే అన్నా
- తుఫాన్ సహాయక చర్యలను డైవర్ట్ చేసేందుకు కుట్రలు
- నేను దళిత హిందువుడిని..భూమనలా మతం మార్చుకోను
- హిందువుల మనోభావాలు దెబ్బతిని ఉంటే క్షమాపణలు
- టీటీడీ పాలకమండలి సభ్యుడు ఎం.ఎస్.రాజు



అమరావతి (చైతన్యరథం): భగవద్గీతని అవమానపరిచినట్లు వైసీపీ, అనుకూల సోషల్ మీడియా చేస్తున్న ప్రచారాలను ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు ఒక ప్రకటనలో ఖండించారు. తాను హిందువునని, రాజ్యాంగం వల్లే దళితుల జీవితాల్లో వెలుగులు వచ్చాయని వ్యాఖ్యానించినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. తాను ఎక్కడా భగవద్గీతను, ఇతర మత గ్రంథాలను కించపరిచి నట్లు ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. కేవలం అంబేద్కం గొప్పతనం, భారత రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని వివరించే ప్రయత్నం మాత్రమే చేశాను. భగవద్గీత, ఖురాన్ వంటి మహా గ్రంథాల వల్ల దళితుల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదు. కానీ రాజ్యాంగం వల్ల దళితుల జీవిత ప్రమాణాలు మెరుగు పడ్డాయని మాత్రమే చెప్పా ను. ఎక్కడా భగవద్గీతను అవమాన పరిచే వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. హిందూ సమాజాన్ని కించపరిచే వ్యాఖ్యలు నేను చేయలేదు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రస్తుత పరిస్థితులు, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు హర్షిస్తున్న నేపథ్యంలో వాటిని డైవర్ట్ చేసేందుకు వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న కుట్రలో భాగంగా నాపై అసత్య ప్రచారా లు చేస్తున్నారు. నేను హిందువుని, దళితుడిని. ముఖ్యమంత్రి తనకు టీటీడీ పాలకమండలి సభ్యుడిగా అవకాశం ఇచ్చారు. నా నియోజికవర్గంలో శ్రీనివాస కళ్యాణం నిర్వహించాలని ఎనిమిది నిలల క్రితమే నేను లేఖ రాశాను. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో 5000 దేవాలయాలు నిర్మించాలని టీటీడీని ఆదేశిస్తే ఎక్కువ శాతం గుడులు దళితవాడల్లోనే నిర్మించాలని టీటీడీ బోర్డు కు విజ్ఞప్తి చేసినవాడిని. వైసీపీ సోషల్ మీడియా బ్యాచ్ పనిగట్టు కుని నేను క్రైస్తవుడిని అని అసత్యపు ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా నేను వైసీపీ నాయకులు సవాల్ విసురుతున్నా.. నేను పుట్టిన ఊరికి వెళ్లి తన కుటుంబం గురించి పూర్తిగా విచారణ చేసుకోవచ్చు. నేను హిందువుని.. వేంకటేశ్వర స్వామి భక్తుడిని. మీ కరుణాకర్‌రెడ్డిలాగా ఇంట్లో ఒక మతాన్ని ఆచరిస్తూ.. పదవుల కోసం బయట హిందువుడిలా డ్రామాలు ఆడే వ్యక్తిని కాను. వైసీపీ చేస్తున్న కుట్రలో భాగస్వామ్యం కావొద్దని హిందూ సమాజా న్ని కోరుతున్నాను. భగవద్గీతను నేను కించపరిచానని మీ మనో భావాలు దెబ్బతిని ఉంటే ఒక హిందూ సోదరుడిగా మీకు క్షమాప ణలు చెబుతున్నట్లు తెలిపారు.

## గత 6 నెలల్లో

# మెరుగుపడిన ప్రభుత్వ వైద్యం

- వైద్య సిబ్బంది హాజరు, ఓపీ, ఐపీ సేవల్లో పురోగతి
- 42 నుండి 26 నిమిషాలకు తగ్గిన ఓపీ సేవల సమయం
- నిరంతర పర్యవేక్షణ సత్ఫలితాలిస్తోందన్న మంత్రి సత్యకుమార్ యాదవ్
- నూతన మూల్యాంకన వ్యవస్థ ద్వారా జిల్లాలకు ర్యాంకులు
- అగ్రస్థానంలో తూర్పుగోదావరి, కడప, తిరుపతి
- వెనుకబడ్డ అల్లూరి, గుంటూరు, శ్రీకాకుళం
- గత 6 నెలల పనితీరును సమగ్రంగా సమీక్షించిన మంత్రి



అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం జూన్ 2024లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ వైద్య రంగాన్ని మెరుగుపరచడానికి చేపట్టిన ప్రయత్నాలు సానుకూల ఫలితాల్ని ఇస్తున్నాయని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మొదటి 6 నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్) ఈ దిశగా చేసిన ప్రయత్నాలు, మార్పులను ఉన్నతాధికారులతో మంత్రి సమగ్రంగా సమీక్షించారు. వివిధ శాఖల పనితీరు, పథకాల అమలుకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని తెప్పించుకున్న మంత్రి అనుకూల, ప్రతికూల అంశాల్ని నిశితంగా గమనించారు.

గతేడాది అధికారంలోకొచ్చిన వెంటనే వైద్యారోగ్య రంగంలో నెలకొన్న పరిస్థితుల్ని గమనించి, ప్రభుత్వం చేపట్టిన దిద్దుబాటు చర్యల ఫలితాలపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. నిరంతరం పర్యవేక్షణతో వ్యవస్థలో జవాబుదారీతనం కోసం చేసిన కృషి మంచి ఫలితాల్ని ఇవ్వడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అయితే వ్యవస్థ పూర్తి ప్రక్షాళన కోసం చేయాల్సినది ఇంకా చాలా ఉందని, ఈ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు.

వైద్య సిబ్బంది హాజరు, ఓపీ..ఐపీ సేవల్లో పురోగతి, డయాగ్నొస్టిక్ సేవల రాశిలో ప్రగతి, ఆరోగ్య పథకాల అమలులో వచ్చిన మార్పు ఆశాజనకంగా ఉందని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

### మొదటిసారిగా మూల్యాంకన వ్యవస్థ

గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా సంక్రమించిన లోపాలు, సమస్యలను సవరించడంపై తొలుతగా మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టి పెట్టారు. క్రమశిక్షణారాహిత్యం, జవాబుదారీతనం లోపించడంపై ఆందోళన చెందిన మంత్రి మార్పుకోసం వివిధ విభాగాల పనితీరు, పథకాల అమలు మదింపు కోసం ఒక పటిష్టమైన, సమగ్రమైన మూల్యాంకన వ్యవస్థను గతేడాది నవంబరులో ప్రవేశపెట్టారు. దీని ఆధారంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి 6 నెలల కాలంలో వివిధ జిల్లాల పనితీరు, పథకాల అమలు తీరుపై డివిజన్లకు ర్యాంకులు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఈ మూల్యాంకనం ఆధారంగా వాటిని మంత్రి సమీక్షించారు.

### వైద్య సిబ్బంది హాజరు

ఈ 6 నెలల కాలంలో ప్రభుత్వ వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు ఈ ఏడాది ఏప్రిల్‌లో 83 శాతం నుంచి సెప్టెంబరు నాటికి 92 శాతానికి పెరిగినట్లు గమనించిన మంత్రి హర్షం వెలిబుచ్చారు. ఈ కాలంలో సగటు హాజరు 87 శాతంగా నమోదైంది. నర్సులు, పారా మెడికల్ సిబ్బంది హాజరు 90 శాతానికి పైగా ఉండగా...వైద్యుల హాజరు 82 శాతం మాత్రమే ఉండటాన్ని గమనించిన మంత్రి తగు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారుల్ని ఆదేశించారు.

### జీజీహెచ్‌ల్లో హాజరు

డాక్టర్లు, ఇతర సిబ్బంది హాజరులో విశాఖపట్నంలోని కేజీహెచ్ (93.13 శాతం), కర్నూలు జీజీహెచ్ (92.71 శాతం), రాజమహేంద్రవరం జీజీహెచ్ (91.46 శాతం) హాజరుతో అగ్రస్థానంలో నిలిచాయి. తక్కువ హాజరు నమోదైన జీజీహెచ్‌లు: నెల్లూరు (66.44 శాతం), ఏలూరు (76.30 శాతం), గుంటూరు (77.84 శాతం). హాజరు విషయంలో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీ (100 శాతం), కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్ (99.92 శాతం), విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ (95.30 శాతం)తో ముందు వరుసలో ఉన్నాయి. దాదాపు 80 శాతం హజరుతో విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీ, శ్రీకాకుళంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, గుంటూరు జీఎంసీ వెనుకబడ్డాయి. కొత్తగా స్థాపించిన 6 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో హాజరుపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. డిఎంఇ, అనుబంధ సంస్థలు, నర్సింగ్ కళాశాలల్లో హాజరు తక్కువగా ఉండడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

### త్వరగా ఓపీ సేవలు

ఈ 6 నెలల కాలంలో 20 శాతానికి పైగా వృద్ధితో ప్రభుత్వ వైద్య శాలల్లో మొత్తం 4 కోట్లకు పైగా ఓపీ సేవలు అందించారు. ముఖ్యంగా ఓపీ సేవలందించడానికి ఇంతకుముందు సగటున రోగికి 42 నిమిషాలు పట్టగా ఈ సమీక్షా కాలంలో అది 26 నిమిషాలకు తగ్గడంపై మంత్రి సంతోషం వెలిబుచ్చారు. ఓపీ, అభా రిజిస్ట్రేషన్ కౌంటర్లను భారీగా పెంచడం వల్ల ఇది సాధ్యమైందని ఆయన గమనించారు. 2024లో జీజీహెచ్‌ల్లో కేవలం 80 ఓపీ కౌంటర్లు మాత్రమే ఉండగా ఈ ఏడాది సెప్టెంబరు నాటికి అవి 150కి పెరిగాయి. అభా కౌంటర్లు 53 నుండి 116కు పెరిగాయి.

ఈ సమీక్షా కాలంలో మొత్తం 2.50 కోట్ల మేరకు ఎక్స్ రే, అల్ట్రాసౌండ్, ఇసిజి, ల్యాబ్ టెస్టులు నిర్వహించారు. ఈ విషయంలో 6.10 శాతం వృద్ధి నమోదైంది.

### జిల్లాల పనితీరు

పలు నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పథకాల అమలులో తూర్పు గోదావరి, కడప, తిరుపతి జిల్లాలు అగ్రస్థానంలో నిలవగా అల్లూరి సీతారామరాజు, గుంటూరు, శ్రీకాకుళం జిల్లాలు వెనుకబడ్డాయి. డివిజన్ల పనితీరు ప్రకారం డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం, మాతా శిశు ఆరోగ్య విభాగం అగ్రస్థానంలో నిలవగా అసంక్రమణ వ్యాధుల విభాగం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్కే) వెనుకబడినట్లు మంత్రి గమనించారు.

డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం కింద టిబి, కుష్టు, హెపటైటిస్, వ్యాధులు ప్రబలడంపై నిఘా, అంధత్వ నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ దిశగా సత్ఫలితాలను సాధించడంపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అసంక్రమిక వ్యాధులకు సంబంధించి భారీ స్థాయిలో స్క్రీనింగ్ జరుగుతున్నా ఈ వ్యాధుల బారిన పడిన వారికి తగు చికిత్సలు అందించడంలో లోపం కనపడుతోందని, దీనిని సవరించాలని మంత్రి స్పష్టం చేశారు. మొదటిసారిగా చేపట్టిన మూల్యాంకన వ్యవస్థ ఫలితాల ఆధారంగా వెల్లడైన లోపాలను సరిదిద్దుకోడానికి తగు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

# మొంథా తుఫాన్‌ను ఎదుర్కొన్న తీరు అద్భుతం

- సీఎం చంద్రబాబు వల్లే ప్రాణనష్టం నివారణ
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు (చైతన్యరథం): మొంథా తుఫాన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో ఎదుర్కొన్న తీరు అభినంద నీయమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఒక ప్రకటనలో ప్రశంసించారు. మొంథా తుఫాన్ బలహీన పడడంతో రాష్ట్రానికి ముప్పు తప్పిందన్నారు. మొంథా తుఫాన్ బలహీన పడిన తర్వాత సీయం ఏరియల్ సర్వే నిర్వహించడం, తుఫాను వల్ల నష్టపోయిన ప్రజలను స్వయంగా పరామర్శించడంతో పాటు బాధితులకు ముఖ్యమంత్రి సహాయం అందించి ఆత్మస్థైర్యాన్ని నింపడం స్ఫూర్తిదాయకమన్నారు. తుఫాన్ వల్ల పునరావాస కేంద్రాలకు తరలివచ్చిన ప్రతి కుటుంబానికి రూ.3,000 ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి, మత్స్యకార కుటుంబాలకు 25 నుంచి 50 కిలోల బియ్యంతో పాటు, పప్పు, నూనె, ఉల్లిగడ్డలు, బంగాళా దుంపలు, చక్కెర వంటి నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారని, ఆపదలో ఉన్న ఆప్తులకు ఆపన్న హస్తాన్ని అందించడంలో సీఎం చంద్రబాబును మించిన సీఎంను తాను చూడలేదన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కు రూ.5 లక్షల పరిహారం ప్రకటించారన్నారు. దాదాపు 87 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అంచనాలు రూపొందించి తక్షణం సమాచారాన్ని సేకరించడం సీఎం పాలనా దక్షతకు నిదర్శ నమన్నారు. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో చిత్తూరు పార్లమెంటు పరిధిలో అప్రమత్తతో వ్యవహరించి, ప్రజలకు బాసట గా నిలిచిన ఎమ్మెల్యేలు, అధికారులను అభినందించారు.

# ఆర్యవైశ్యుల అభివృద్ధే లక్ష్యం

- త్వరలో సహకార క్రెడిట్ సొసైటీ ఏర్పాటు
- పెనుగొండకు వాసవీ పెనుగొండగా పేరు
- బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ మంత్రి సవిత



అమరావతి (చైతన్యరథం): అన్ని రంగాల్లో ఆర్యవైశ్యుల అభివృ ద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేశ్ ఆధ్వర్యంలో వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ సంఘం, ఏపీ ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి, వాసవీ ఫౌండేషన్, ఐవీఎఫ్ ప్రతినిధులు గురువారం కలిశారు. రాష్ట్రంలోని వైశ్యులను ఆర్య, శెట్టి, గుప్త, కోమటి, వేగిన, బుక్క, జనపశెట్టి అనే పేర్లతో సంభోదిస్తున్నారని, వారందరినీ ఆర్యవైశ్యులుగా ప్రభుత్వం గుర్తి స్తూ చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ వివిధ పేర్లతో సంభోదిస్తున్న ఆర్యవైశు ్యలను ఒకే గొడుగు తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నామని, ఇదే విషయం ఇప్పటికే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. వివిధ పేర్లతో పిలుస్తున్న వారందరినీ ఆర్యవైశ్యులుగా గుర్తిస్తూ చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చా రు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఆది నుంచి సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్యవైశు ్యల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 2018-19లో ఆర్యవైశ్యుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.30 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్యవైశ్య పేదలను గుర్తించి ఆర్థికంగా అభివృద్ధే చెందేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగం గానే ఏపీ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాదిరిగా ఆర్యవైశ్యులకు ఆర్థిక భరోసా కల్పించడానికి సహకార క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించా రన్నారు. త్వరలోనే ఏపీ ఆర్యవైశ్య కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తున్నామన్నారు. ఏపీ ఆర్యవైశ్య కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా ఆర్యవైశ్యులకు రుణ సదుపా యం కల్పించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఆర్యవైశ్యులకు ఎటువంటి మేలు చేయలే దన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఇంటికో వ్యాపార వేత్తను తయారు చేసేలా సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటులో ఆర్యవైశ్యులకు పెద్దపీట వేయబోతున్నామన్నారు.

### అమ్మవారి పేరుతో వాసవీ పెనుగొండగా నామకరణం

అమరావతిలో పొట్టి శ్రీరాముల స్మారక స్మృతివనం ఏర్పాటు కు 6.8 ఎకరాల కేటాయించారని తెలిపారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారు జన్మించిన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ గ్రామానికి వాసవీ పెనుగొండ గ్రామంగా త్వరలో పేరు మార్చ నున్నామని, ఈ మేరకు త్వరలో జీవో రానుందని తెలిపారు. దామాషా ప్రకారం ఆర్యవైశ్యులకు పదవుల కేటాయిస్తున్నా మన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణా లు అందజేయబోతున్నామని వివరించారు. అనంతరం మంత్రి సవితను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భగవాన్ నారాయణ, చిన్ని రామసత్యనారాయణ, కె.రజనీ, తల్లం సత్య నారాయణ, వీవీకే నర్సింహారావు, కోనా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఒక్క రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**• తుపాను దాటికి నష్టపోయిన ప్రతిరైతును ఆదుకుంటాం : ఎమ్మెల్యే సత్యప్రభ హామీ**



ప్రత్తిపాడు (చైతన్యరథం): మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం, పెద్దిపాలెం గ్రామాల్లో భారీ ఈదురుగాలులు, వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతుల పంటనష్టాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఎమ్మెల్యే సత్యప్రభ స్వయంగా గ్రామాలను సందర్శించారు. పత్తి, వరి పంటలతో పాటు అరటి, బొప్పాయి, ఆకుకూరలు, కూరగాయల పంటలు కూడా నష్టపోయిన పరిస్థితిని ఎమ్మెల్యే పరిశీలించి, స్థానిక రైతులు, వ్యవసాయ అధికారులు నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ... నియోజకవర్గ వ్యాప్తంగా తుఫాన్ తాకిడికి గురైన ప్రాంతాల్లో పంట నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేయాలని, అధికారులకు సూచించామని తెలిపారు. ప్రాథమికంగా చాలా రకాల పంటలు నష్టపోయిన విషయం గమనించామని, పూర్తి నివేదిక అందిన వెంటనే రైతుల నష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, ఏ ఒక్క రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే సత్యప్రభ హామీ ఇచ్చారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# దెబ్బతిన్న రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే బండారు

**•రావులపాడులో పంట నష్టాన్ని పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే**



కొత్తపేట (చైతన్యరథం): మొంథా తుఫానుతో దెబ్బతిన్న అరటి, వరి, ఉద్యాన, కూరగాయల పంటల రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలియజేశారు. రావులపాలెం మండలం రావులపాడులో గురువారం ఆయన తుఫాను కారణంగా నష్టపోయిన అరటి తోటలను పరిశీలించారు. అరటి రైతులతో మాట్లాడారు. వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క అరటి చెట్టుకు రూ.200 వరకు పెట్టుబడి ఖర్చులు అవుతున్నాయని వారు ఎమ్మెల్యేకు తెలిపారు. చెట్లు పడిపోవడంతో పూర్తిగా నష్టపోయామన్నారు. వారి ఆవేదన విని ఎమ్మెల్యే బండారు చలించిపోయారు. తక్షణమే నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందే విధంగా నమోదు కార్యక్రమం చేపట్టాలని వ్యవసాయ అధికారులను, సిబ్బందిని ఆయన ఆదేశించారు. అరటికి ఎకరాకు రూ.14వేలు, వరికి ఎకరాకు రూ.8వేలు, కూరగాయల పంటలకు రూ.10వేలు నష్టపరిహారంగా ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన రైతులకు తెలియజేశారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం తుఫాను గాలులకు పడిపోయిన వరి పొలాలను పరిశీలించారు.

# మున్నేరు బ్రిడ్జ్‌పై వాహనాల రాకపోకలు నిలిపివేయాలి

**• అధికారులకు సూచించిన రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎంపీ కేశినేని శివనాథ్**



జగ్గయ్యపేట (చైతన్యరథం): వత్సవాయి మండలంలోని లింగాల బ్రిడ్జిపైకి మున్నేరు వరద ప్రవాహం రావటంతో మున్నేరు బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలు నిలిపివేయాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వుండాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ అధికారులకు సూచించారు. గురువారం రాత్రి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య లతో కలిసి లింగాల బ్రిడ్జ్ వద్ద మున్నేరు ప్రవాహాన్ని పరిశీలించారు. తెలంగాణలో కురిసిన వర్షాల వల్ల దిగువకు వరదనీరు పోటెత్తుతోందని.. ముందస్తు జాగ్రత్తలతో ప్రజలకు ఇబ్బందిలేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్ అధికారులకు తెలిపారు. అలాగే లోతట్టు ప్రాంత ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఇప్పటికే పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. లోతట్టు ప్రాంతంలో వున్న రైతులు వారి పశువులను ఎగువ ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అధికారులు నిరంతరం పహారా కాస్తూ, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.

# ప్రభుత్వం అండగా ఉంటుంది... అధైర్య పడొద్దు

**• నేలకొరిగిన పంటలను పరిశీలించిన ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు**



ఉంగుటూరు (చైతన్యరథం): మొంథా తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులు అధైర్యపడొద్దని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు భరోసా ఇచ్చారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు, నల్లమాడు, రామచంద్రపురంలో నేలకొరిగిన అరటి తోట, నీటమునిగిన పంట పొలాలను స్థానిక నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రంగు మారిన ధాన్యం, తేమ శాతం 17 లోపు ఉండాలనే నిబంధనలు లేకుండా చూడాలని రైతులు కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. నియోజకవర్గంలో 5,444 ఎకరాల పంట నీటమునిగిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచన వేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే పూర్తి నష్టం అంచనాలను అంశాల వారీగా మదింపు చేస్తామని వివరించారు.

# గొర్జిపాడు గ్రామాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా, కురుపాం మండలం, మొండెంఖల్లు పంచాయతీ గొర్జిపాడు గ్రామాన్ని ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి గురువారం సందర్శించారు. 'మొంథా' తుఫాన్ ప్రభావంతో గ్రామంలో కూలిన ఇల్లును పరిశీలించి ప్రభుత్వం తరపున బాధితులకు అండగా ఉంటామన్నారు. అలాగే పునరావాసం కల్పించిన గ్రామానికి చెందిన తుఫాన్ బాధితులకు ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఎమ్మెల్యే వెంట స్టేట్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయక్, బలరాం, జి.ఎల్.పురం మండల కన్వీనర్ అడ్డాకుల నరేష్, నాయకులు ప్రసాద్, వైకుంఠం, విశ్వేశ్వరరావు, హితేష్, శ్రీరాములు, శివన్నారాయణ, రాజేష్, మురళి, బాలు, మన్మథ, హరిచంద్ర, ఎమ్మార్వో జయ, సచివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను : ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో తాను పనిచేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బలిజిపేట మండలంలోని నూకలవాడ, వంతరాం గ్రామాల వరద తాకిడి ప్రాంతాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నూకలవాడలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ శాసనసభ సబ్ కమిటీ సమావేశానికి వెళ్లడం వల్ల సకాలంలో ఇక్కడకు రాలేకపోయామని, అక్కడ నుంచే ప్రతి గంటకు ఒకసారి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతోను, మండలస్థాయి అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యల్లో పాల్గొనేటట్టు చేసామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మొంథా తుఫాను సంభవించిన రోజుల్లో రాష్ట్ర ప్రజలను ప్రశాంతంగా నిద్రించేలా చేసి ఒక చోట కూర్చొని అక్కడ నుంచే రాష్ట్ర యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి తుఫాను నష్టం నుంచి రాష్ట్ర ప్రజలను కాపాడారన్నారు. నియోజకవర్గంలో విద్యుత్తు సమస్యలు లేకుండా ప్రజలకు మెరుగైన విద్యుత్తును అందజేసేందుకు అజ్జాడలో ఒక విద్యుత్ సబ్ స్టేషన్, బలిజిపేట మండల హెడ్ క్వార్టర్‌లో ఒక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకువచ్చామన్నారు. నియోజవర్గంలో బలిజిపేట మండల ప్రజలు తనకు ఎంతో ఆదరించి అధిక మెజారిటీ ఇచ్చినందున బలిజిపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తన సూచన మేరకు బలిజిపేట మండల అధికారులు తుఫాను సమయంలో రాత్రింబవళ్లు కష్టించి పనిచేసి బాధితులను ఆదుకున్నారని ఈ సందర్భంగా ఆయన మండల స్థాయి అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా నూకలవాడ వరద బాధితులకు ఒక్కొక్కరికి రూ. 1,000 నగదు, బియ్యం, పంచదార, ఆయిల్, నిత్యావసర సరకులను 14 కుటుంబాలకు చెందిన 17 మందికి ఎంఎల్ఏ ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం వంతరాం గ్రామంలోని లోతట్టు ప్రాంతాన్ని సందర్శించి వేగావతి నది నీరు గ్రామంలోకి రాకుండా ఉండేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



ముమ్మిడివరం (చైతన్యరథం): అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి ఇతర పంటలను నియోజకవర్గ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు గురువారం పరిశీలించారు. మొంథా తుఫాను తదనంతరం క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులతో మాట్లాడి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. తుపానును రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని, ప్రభుత్వంలోని అన్ని విభాగాల్లోని అధికారుల కృషి వల్ల ఇది సాధ్యమైందన్నారు. తుపాను ప్రభావవ తీవ్రంగా ఉండటంతో ప్రాణనష్టం జరగకుండా చూశామని, కానీ పంటలను కాపాడుకోలేకపోయామన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాలకు జరిగిన నష్టాన్ని కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని దాట్ల సుబ్బరాజు భరోసా కల్పించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ బాధితులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ చేయూత



వినుకొండ (చైతన్యరథం): మొంథా తుఫాన్ కారణంగా సంభవించిన వరదల్లో తీవ్రంగా నష్టపోయిన వినుకొండ మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీలోని అరుంధతీ కాలనీ మరియు రజక కాలనీలలోని 200కు పైగా కుటుంబాలకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అండగా నిలిచారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న వరద బాధితులకు వంట సామాగ్రిని పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి రెండు దుప్పట్లు, రెండు చీరలు అందజేశారు. వరద బాధితులకు ప్రభుత్వ తక్షణ ద్వారా అందించిన బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు, రూ.1000 ఆర్థిక సహాయాన్ని అందించారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ చేసిన సహాయం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం : అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్యరథం): మొంథా తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేసామని, ఇందులో ఒక్క కృష్ణా జిల్లాలోనే 46వేల హెక్టార్లలో నష్టం కలిగిందనీ చెప్పారు. ఈ జిల్లాలో దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. గురువారం కృష్ణా జిల్లా పెనమలూరు, పామర్రు నియోజకవర్గాలలో స్థానిక ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కుమార్ రాజాలతో కలసి పర్యటించిన మంత్రి అచ్చెన్నాయుడు... మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న కంద, అరటి, వరి పంటలను పరిశీలించారు.



# తుపాను బాధితులకు ప్రభుత్వ సాయం పంపిణీ : గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): మొంథా తుఫాన్ ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున నిత్యావసర సరుకులను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం పంపిణీ చేశారు. ఏటి అగ్రహారం ప్రాంతంలోని రేషన్ షాపు వద్ద బాధితులకు ప్రభుత్వం తరపున బియ్యం, పప్పు, నూనె, కూరగాయలు, పంచదార, ఉల్లిపాయలు వంటి నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గత రెండు మూడు రోజులుగా ఏపీ ప్రజలు ఒక విపత్కర పరిస్థితిని కలిసికట్టుగా చాలా సమర్ధవంతంగా ఈ మొంథా తుఫాన్‌ని ఎదుర్కొన్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, పవన్ కళ్యాణ్ నిరంతర సమీక్షా సమావేశాలు నిర్వహించడంతో, రాష్ట్రవ్యాప్తంగా ఈ తుఫాన్‌ని ఎంత ప్రణాళికబద్ధంగా ఎదుర్కొన్నామో ప్రజలందరూ చూశారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

**విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కోగలిగాం**

ప్రాణ నష్టం, ఆస్తి నష్టం పెద్దగా లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. అయినప్పటికీ కొంతమంది లోతట్టు ప్రాంత ప్రజలు ముంపుకు గురయ్యారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 325 మంది తుఫాన్ బాధితులు గత రెండు రోజులుగా రిహాబిలిటేషన్ సెంటర్లలో ఆశ్రయం పొందారు. బాధితులందరికీ ప్రభుత్వం తరపున గురువారం ఏటి అగ్రహారంలో 60 మందికి నిత్యావసర సరుకులు అందజేస్తున్నాం. పంపిణీ చేయటం జరిగిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అధికారులు, స్థానిక డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు అందరం కలిసి బాధిత కుటుంబాలందరికీ సరుకులు అందేలా చూస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల శ్రేయస్సు కోసం కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

# తుపాను నుంచి ప్రజలను కంటికి రెప్పలా కాపాడాం

**●ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చూశాం**

**●తుపాను బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్, కోవెలమూడి నాని, పులి శ్రీనివాసులు**



గుంటూరు (చైతన్యరథం): తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక చౌత్రా సెంటర్‌లోని పాల కేంద్రం వద్ద పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు మేయర్ కోవెలమూడి నాని, కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకొని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో భోజన వసతి, మంచినీరు, పాలు సదుపాయాలు కల్పించామని వెల్లడించారు. తుపాను ప్రభావ ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం పెద్ద మనస్సుతో చర్యలు చేపట్టిందని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు అర్ధరాత్రి సమయంలో కూడా రాష్ట్రంలో తుఫాను ప్రభావాన్ని పరిశీలిస్తూ అధికారులకు, నాయకులకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు స్ఫూర్తితో రేయింబవళ్లు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పరిస్థితిని సమీక్షించానని స్పష్టం చేశారు. అందుకే రాష్ట్రంలో ఆస్తి, ప్రాణ లేకుండా చేయగలిగామని తెలిపారు. ఒక కుటుంబానికి రూ.3 వేలు, ఒక వ్యక్తికి ?1000 చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు రూ.3 వేలు విలువ చేసే నిత్యావసర సరుకుల కిట్లను అందించామని అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 25 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుపానుకు చిత్తశుద్ధితో పని చేసిన అధికారులకు, పార్టీ నాయకులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షైక్ షజిలా, కార్పొరేటర్ చిష్టి, మొహమ్మద్ హాఫీజ్, డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ సలీం, కొణిదె దుర్గ, ఎస్ఎస్ పి జాదా తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



కంచికచర్ల (చైతన్యరథం): తుఫాను ప్రభావంతో నష్టం వాటిల్లిన వరి పంట పొలాలను పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గురువారం పరిటాల గ్రామాన్ని సందర్శించారు. ఆమెతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక రైతులు కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. తుఫానుతో వరి పంటలు నేలకొరిగిన పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, రైతులతో మాట్లాడి వారి నష్టాన్ని అర్థం చేసుకున్నారు. పంట నష్టాలను వాటి తీవ్రతను బట్టి అంచనా వేయాలని, నష్టపరిహార ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... "ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. న్యాయమైన పరిహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, రైతులు, రైతు నాయకులు, కూటమి నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొంథా విలయం రైతాంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసింది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**●వందల ఎకరాల్లో పత్తి, మిరప, ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి**

**●కేంద్రం మానవతా ధృక్పథంతో సగమైనా పెట్టుబడిసాయం అందించాలి**



చిలకలూరిపేట (చైతన్యరథం): మొంథా పెను విపత్తుతో రాష్ట్ర రైతాంగం కోలుకోలేని విధంగా నష్టపోయిందని, సమస్యను గుర్తించి, మానవవతా ధృక్పథంలో కేంద్రప్రభుత్వం తక్షణం ఆదుకుంటేనే రాష్ట్రంలో సాగు బాగుపడుతుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన నియోజకవర్గంలో నీటమునిగిన పంట పొలాలను పరిశీలించి, అన్నదాతలతో మాట్లాడి వారి బాధలు తెలుసుకున్నారు. చిలకలూరిపేట మండలం కోమటినేనివారిపాలెం, నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం, ఇర్లపాడు గ్రామాల్లో వరదపాలైన పైర్లను పరిశీలించారు. అనంతరం అమీన్ సాహెబ్ పాలెంలో తుపాను బాధితులకు ఒక్కొక్కరికి రూ.3వేల విలువైన బియ్యం, నిత్యావసరాలు అందించి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మొంథా తుపానుతో నష్టపోయిన రైతాంగాన్ని కేంద్రమే ఆదుకోవాలని, పెట్టిన పెట్టుబడిలో సగమైనా రైతుకు అందిస్తేనే వ్యవసాయం నిలుస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. రైతులు మరలా సాగుదిశగా ఆలోచనచేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు కేంద్రాన్ని సంప్రదించి అన్నదాతలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. వందలఎకరాల్లో పంటలు నీటమునిగాయని, అవి బతుకుతాయనే నమ్మకం రైతులకు లేదన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజ్‌లు.. బ్రిడ్జిలు, ఇతర సామాజిక భవనాల నిర్మాణానికి కూడా కేంద్రం సరిపడా నిధులు అందిస్తేనే జరిగిన నష్టం నుంచి ప్రజలు త్వరగా కోలుకుంటారని ప్రత్తిపాటి తెలిపారు.

**గత ప్రభుత్వం వాగుల్లో పూడిక తీయకపోవడంతోనే వరద నీరు పొలాల్ని జనావాసాల్ని ముంచేసింది**

మొంథా ప్రభావం రైతులకు కన్నీళ్లు మిగిల్చిందని, ఆరుగాలం శ్రమించిన అన్నదాతను తుపాను ఈ విధంగా దెబ్బతీయడం బాధాకరమని ప్రత్తిపాటి చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా 22 సెం.మీ వర్షపాతం నమోదైందని, దాంతో వరద నీటి ప్రవాహం పొలాలు, జనావాసాల్ని ముంచేసిందన్నారు. ప్రధాన వాగులైన కుప్పగంజి, ఓగేరులో పూడిక, తూటికాడ, గుర్రపుడెక్క అడ్డుగా ఉండటంతో వరదనీటికి అడ్డంకి ఏర్పడి ప్రజలకు, పంటలకు నష్టం చేకూర్చిందన్నారు.

# దెబ్బతిన్న పంటలను పరిశీలించిన భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు (చైతన్యరథం): నియోజకవర్గంలో మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటపొలాలను నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలోని ఉంగుటూరు – కంభంపాడు మధ్య నీటమునిగిన పంటపొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించిందని, అధికారులు ఇప్పటికే తుపాను ప్రభావం ఉన్న గ్రామాల్లో పంట నష్టాన్ని అంచనా వేయడం జరుగుతుందని త్వరలోనే ప్రభుత్వం రైతులకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. నష్టపోయిన రైతులకు ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. భారీ తుపాను కారణంగా ప్రాణనష్టం లేకుండా చూడటం జరిగిందని, కానీ పంటలు దెబ్బతినడంతో రైతులు నష్టపోయారని వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

# సీఎం చంద్రబాబు ఇంట్లో కూర్చోలేదు

## ప్రజల కష్టాలను చూసి... అధికారులను, ప్రజాప్రతినిధులను పరుగులు తీయించారు : ఎమ్మెల్యే సోమిరెడ్డి



సర్వేపల్లి, (చైతన్యరథం): తోటపల్లి గూడూరు మండలం కోడూరు పంచాయతీ నడింపాళెంలో ప్రభుత్వం మంజూరు చేసిన అర్థికసాయంతో పాటు నిత్యావసర సరుకులను శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రజలకు పంపిణీ చేశారు. పునరావాస కేంద్రాలకు తరలించిన 690 గిరిజన కుటుంబాలతో పాటు టీపీ గూడూరు, ముత్తుకూరు మండలాల్లోని 1925 మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందించారు. తుఫాన్ కారణంగా వేట కోల్పోయిన మత్స్యకారులకు 50 కిలోల బియ్యం, నూనె, చక్కెర తదితర సరుకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ బీభత్సం సృష్టించిందన్నారు. రాష్ట్ర ప్రజలు కష్టాల్లో ఉంటే సీఎం చంద్రబాబు నాయుడు ఇంట్లో కూర్చోలేదన్నారు. రేయింబవళ్లు మానిటరింగ్ చేస్తూ నష్ట తీవ్రతను తగ్గించేందుకు అధికారులను అప్రమత్తం చేశారన్నారు. చంద్రబాబు నాయుడికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తోడై అందరినీ పరుగులు పెట్టించారన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్సులు నిర్వహించి ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోనూ టీడీపీ నేతలు, కార్యకర్తలు కష్టపడి పనిచేశారన్నారు. ఎక్కడ ఇబ్బంది ఉంటే అక్కడకు వెళ్లిపోయి అవసరమైన సహాయ చర్యలు చేపట్టారన్నారు. ప్రొక్లెయిన్లు, జేసీబీలు పెట్టి యుద్ధప్రాతిపదికన పనులు చేయించారన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి భోజనాలు అందించారన్నారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు రేయింబవళ్లు కష్టపడ్డారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమన్వయంతో ముందుకు సాగుతూ శ్రమించారని వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని బాగా సర్దుకున్న వాళ్ళు మాత్రం ఎక్కడా సహాయచర్యల్లో కనిపించలేదన్నారు. కౌబాయ్ వేషధారణలో ఉన్న వ్యక్తి మాత్రం అక్కడక్కడా కనిపించి తనను, తన కొడుకునూ తిట్టేసి కరోనా ప్యాలెస్‌లోకి వెళ్లిపోయాడని విమర్శించారు. నడింపాళెంలో శిథిలావస్థలో ఉన్న తుఫాన్ షెల్టర్ పునర్నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్ రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రూ.3 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించామన్నారు. అత్యంత పేదరికంలో ఉన్న గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పలు కాలనీలను పామాయిల్ కంపెనీలు దత్తత తీసుకున్నాయన్నారు. సెయిల్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. త్వరలోనే 1000 సోలార్ వీధిలైట్లు అందజేస్తుందని తెలిపారు. త్వరలోనే 8, 9 తరగతులు చదువుతున్న బాలికలకు సైకిళ్లు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు.

# తుపాను బాధితులకు సాయం పంపిణీ

## కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి డోలా, ఎమ్మెల్యే దామచర్ల, సివిల్ సప్లయిస్ ఎండీ ఢిల్లీరావు, జెసీ గోపాలకృష్ణ



ఒంగోలు, (చైతన్యరథం): నగర పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలో మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వ సహాయం క్రింద ప్రజలకు నిత్యావసర సరుకులు బియ్యం, కందిపప్పు, నూనె, కూరగాయలు, ఉల్లిపాయలు పంపిణీ కార్యక్రమంలో మంత్రి స్వామి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సివిల్ సప్లయిస్ ఎండీ ఢిల్లీరావుతో కలిసి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాను ముప్పు తొలగడంతో ప్రజలకు అవసరమైన సహాయాన్ని బాధితులు తమ గృహాలకు వెళ్లిన తర్వాత వారి జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిత్యవసర వస్తువులను, ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వారికి కావాల్సిన నిత్యఅవసరాల సరుకులు పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయించినట్లు తెలిపారు. ఇళ్లలో పేరుకుపోయిన బురదను ఫైర్ ఇంజన్లతో శుభ్రం చేస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ప్రాంతాలలో శుక్రవారం నుంచి వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. భారీ వర్షాలు, అనంతరం తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని చెప్పారు.

# సీఎం చంద్రబాబు ప్రేరణతోనే తుపాను బాధితుల సేవలో తలమునకలు



కోవూరు, (చైతన్యరథం): తుఫాను తీవ్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతర పర్యేక్షణ చేస్తూ అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం వల్లే ఆస్థి, ప్రాణ నష్టాలను నివారించ గలిగామన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు. ఇందుకూరు పేట మండల కేంద్రంలో మొంథా తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకార సోదరులకు ఆమె నిత్యావసర సరుకుల కిట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ మత్స్యకార సోదరులకు ప్రభుత్వం తక్షణ సహాయంగా 50 కిలోల బియ్యంతో పాటు 1 కిలో కందిపప్పు, 1 కేజీ పామాయిల్, కిలో ఉల్లగడ్డలు, కిలో ఎర్రగడ్డలు అందచేసిందన్నారు. ముంపు ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలించి అధికారులతో కలిసి సహాయక చర్యలలో పాల్గొన్న టీడీపీ మరియు కూటమి పార్టీ నాయకులను ఆమె అభినందించారు. బాధితులను కంటికి రెప్పలా కాపాడిన రెవెన్యూ, పోలీస్, వైద్య శాఖాధికారుల పనితీరును ఆమె ప్రశంసించారు. చంద్రబాబు గారి ప్రేరణతో తుఫాను సహాయక బాధ్యతను తమ భూజాల కెత్తుకొని సహాయక శిబిరాలలో వుంటున్న బాధితులకు భోజనం, చిన్న పిల్లలకు పాలు అందించన నాయకులు, కార్యకర్తలు ముందు ముందు యిదే స్ఫూర్తితో పని చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపికృష్ణ, ఎంపీడీఓ నాగేంద్ర బాబు, జెడ్ పి వైస్ ఛైర్మెన్ శ్రీహరికోట విజయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, వెస్ట్ పాళెం పెద్ద కాపు ఊటుకూరు సుబ్రహ్మణ్యం, ఈస్ట్ పాళెం పెద్దకాపు శ్రీహరి శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు పామంజి నరసింహ, ఊటుకూరు రాజ, ముక్కంటి చంద్ర, కటారి బాబు, అంగేరి మల్లయ్య, ముక్కంటి అంకయ్య, వైస్ ప్రెసిడెంట్ ఊటుకూరు ప్రసాద్, వియ్యాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# డ్రోన్లను సద్వినియోగం చేసుకోండి


## ఎమ్మెల్యే కందుల పిలుపు

మార్కాపురం, (చైతన్యరథం): ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు గ్రామంలో నూతన పంట పిచికారీ డ్రోన్‌ను ప్రారంభించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9,80,000 విలువ చేసే ఈ డ్రోన్ ను దాదాపు 80 శాతం సబ్సిడీతో రెండు లక్షల రూపాయలు మాత్రమే ఈ డ్రోన్ లబ్ధిదారులు చెల్లించాలని ఒక రైతు ఒక ఎకరాకు సాధారణంగా మందు పిచికారి చేయాలంటే గంటల సమయం వృధా అవుతుందని కానీ ఈ డ్రోన్‌తో ఒక ఐదు నిమిషాల్లోనే తక్కువ ఖర్చుతో పైరుకు మందు పిచికారీ చేయవచ్చునని ఈ అవకాశాన్ని తర్లుపాడు మండల రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు,, మండలం తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే కూటమి కర్తవ్యం

## గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు, (చైతన్యరథం): మొంథా తుఫాన్ ముంపు ప్రాంత ప్రజలకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రేషన్ పంపిణచ చేశారు. పట్టణంలోని పాములపల్లె రోడ్డులోని రేషన్ షాపులో, తుఫాన్ తీవ్రత తగ్గిన అనంతరం పునరావాస కేంద్రం నుండి తమ గృహాలకు చేరుకున్న 17వ వార్డు సారంగపాణి వీధికి చెందిన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి 25కేజీల బియ్యం, కేజీ చెక్కర, కేజీ కందిపప్పు, కేజీ వంట నూనె, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలో మొంథా తుఫాన్ ప్రభావంతో చెరువులు, వాగులు వరదలతో పోటేత్తాయన్నారు. గిద్దలూరు పట్టణంలోని ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అక్కడ అన్నీ వసతులు కల్పించామన్నారు. పునరావాస కేంద్రాల నుండి వచ్చిన వారికీ రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. పునరావాస కేంద్రంలోని బాధితులకు ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు అందచేస్తామన్నారు. అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తుఫాన్ ముంపు ప్రాంత ప్రజలను సంరక్షించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో అధికార యంత్రాంగం మొంథా తుఫాన్‌ను ఎదుర్కోవటంలో అహర్నిశలు శ్రమించారన్నారు. జిల్లా అధికారులకు, పోలీస్, రెవిన్యూ, స్పెషల్ అధికారులు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, సచివాలయ సిబ్బంది ఉద్యోగులు కృషి చేశారని వారందరికీ అభినందనలు తెలిపారు. గిద్దలూరు తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణ బాబు, ఎన్ఫోర్స్మెంట్ డీటీ రామనారాయణ రెడ్డి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు సయ్యద్ శానేశా వలి, 17వ వార్డు ఇన్చార్జ్ పిడతల రవితేజ, 18వ వార్డు కౌన్సిలర్ షేక్షావలి, బొంతా లక్ష్మిదేవి, దూదేకుల దస్తగిరి, గిద్దలూరు మద్దిలేటి, బొర్రా రాఘవేంద్ర యాదవ్, దూదేకుల ఫాతిమా, షేక్ బాషా పట్టణ కౌన్సిలర్లు లోక్కు రమేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.





# నిత్యావసర సరుకులు పంపిణీ

నెల్లూరు, (చైతన్యరథం): తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు పడ్డ కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరులోని బాలాజీ నగర్ 68వ రేషన్ షాప్ లో తుఫాన్ బాధిత కుటుంబాలకు నెల్లూరు ఆర్డీఓ అనూష, తహసిల్దార్ షఫీ మాలిక్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. 15వ డివిజన్ ప్రెసిడెంట్ చౌదరి, 16వ డివిజన్ అధ్యక్షుడు సాయి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, దశరధరామయ్య, నరేంద్ర, షమీమ్,మాధవరావు, సురేష్, ప్రసాద్, రాజు, రవికుమార్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి



అనంతపురం, అక్టోబర్, (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. గురువారం ఇంటింటికి మంత్రి కార్యక్రమానికి మంత్రి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఉరవకొండ పట్టణంలో మంత్రి విస్తృతంగా పర్యటించి ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే ఆయా శాఖల అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఉరవకొండ పట్టణంలోని బోయ వీధి, లాలు స్వామి గుడి, పాత బజారు, కామన్న కట్ట, కొండప్ప బావి, ముగా బసవన్న కట్ట వీధులలో పర్యటించి నేరుగా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని గ్రామీణ బ్యాంక్ వద్ద ఉరవకొండ పట్టణంలో ఇంటింటికీ త్రాగునీటి సౌకర్యం కల్పించినందుకు మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించి పట్టణ నాయకులు, ప్రజలు, తదితరులు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని శ్రీ మల్లేశ్వరస్వామి గుడిలో పూజలు చేసి మంత్రి పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా గుంతకల్లు రోడ్డు నుంచి కనేకల్ రోడ్డు వరకు వేస్తున్న రోడ్డు నిర్మాణం వల్ల ఇల్లు కోల్పోతున్నామని కొంతమంది ప్రజలు తెలపగా, మంత్రి మాట్లాడుతూ పట్టణ ప్రజలు అభివృద్ధికి సహకరించాలని, రోడ్డు నిర్మాణం వల్ల నష్టపోయిన వారికి న్యాయం చేస్తామని తెలిపారు. పట్టణంలో నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రజలను మంత్రి అడిగి తెలుసుకోగా, మీ కృషి వల్లే నీళ్లు వస్తున్నాయని ప్రజలు తెలపగా.. మంచి నాయకున్ని ఎన్నుకుంటే అభివృద్ధి జరుగుతుందనేది ఇప్పుడు తెలుస్తుందని మంత్రి అన్నారు. ఇందులోభాగంగా డీఆర్డీఏ పరిధిలో మన డబ్బులు - మన లెక్కలు కార్యక్రమం కింద మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కింద ఉరవకొండ నియోజకవర్గంలో 240 కోట్ల రూపాయలకు రుణ ప్రణాళిక తయారు చేయడమైనదని, బ్యాంకు రుణాలు178 కోట్లు, 60 కోట్లు స్త్రీనిధి రుణాల ద్వారా మహిళల



జీవనోపాదులను మెరుగుపరచుటకు విరివిగా రుణాలు అందజేసి వారి జీవ ఆదాయ అభివృద్ధిని పెంచుటకు కృషి చేయడం జరుగుతున్నదని డీఆర్డీఏ పిడి శైలజ తెలుపగా, మన డబ్బులు, మన లెక్కలు కార్యక్రమం కింద మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధించాలి

## రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు



రాప్తాడు, (చైతన్యరథం): పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధించాలని విద్యార్థినులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో ఆమె కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించారు. 18.50లక్షల ఎస్ఎస్ఏ నిధులతో నిర్మించిన ల్యాబ్ ను, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలిసి ప్రారంభించారు. శిలాఫలకం ఆవిష్కరించిన తర్వాత ల్యాబ్ లో పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత కంప్యూటర్లను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. విద్యార్థుల ప్రతిభను చూసి ప్రసంశించారు. రూ.1.25 కోట్ల ఎస్ఎస్ఏ నిధులతో నిర్మిస్తున్న అదనపు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ వచ్చిన తర్వాత అనేక మార్పులు వచ్చాయన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే టెక్నాలజీ పై అవగాహన పెంపొందించే విధంగా అనేక మార్పులు చేస్తున్నారన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ విద్య కోసం ఖర్చు చేస్తున్నారన్నారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు సూచించే విజ్ఞానం వైపు అడుగులు వేయాలని, టెక్నాలజీకి దగ్గరగా ఉండాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

# సీఎం చంద్రబాబు ప్రేరణతోనే నిలబడ్డాం

## దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ లక్ష్మి

దర్శి, (చైతన్యరథం): తుఫాన్ బీభత్సం సృష్టించినప్పటికీ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించకుండా కునుకు లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్ రాత్రంతా మేల్కొని అధికారులు ఆదేశాలిస్తూ ప్రజాప్రతినిధులను, నేతలను అప్రమత్తం చేస్తూ కృషి చేశారని దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. అదే స్పూర్తితో దర్శి నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసి ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచినందుకు వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్, రెవిన్యూ, మండల అభివృద్ధి శాఖ, వ్యవసాయ అధికారులు, ఎలక్ట్రికల్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్ ఇలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మన టిడిపి, జనసేన, బిజెపి నాయకులను కలుపుకొని తుఫాను ఎదుర్కోగలిగామన్నారు. ప్రతి గింజను కొంటామని తడిసిన ధాన్యం కూడా కొనుగోలు జరుగుతుందన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించి రైతులకు ఊరట కలిగించారని అన్నారు.



# సౌదీ నుంచి అనంతపురం చేరుకున్న నిజాం

## ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన నిజాం కుటుంబ సభ్యులు

ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లి అక్కడ చిక్కుకున్న అనంతపురం కు చెందిన నిజాంను.. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చెప్పిన మాట ప్రకారం అనంతపురానికి తీసుకొచ్చారు. నగరంలోని ఆజాద్ నగర్ కు చెందిన నిజాం పై సౌదీలో ఓనర్లు నిత్యం దాడి చేస్తూ చిత్రహింసలకు గురి చేశారు. చివరకు అతన్ని బయటికి నెట్టివేయడంతో సౌదీ లో కనీసం తినేందుకు తిండి కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు ఒక వీడియో సందేశం ద్వారా తన ఆవేదనను వెల్లడించారు. ఈ వీడియో వైరల్ గా మారడంతో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెంటనే స్పందించారు. మంత్రి నారా లోకేష్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. నగరంలోని ఆజాద్ నగర్ లో ఉన్న నిజాం ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంటనే తన స్నేహితుల ద్వారా సౌదీలోని జెడ్డాలో ఉన్న నిజాంను కలిసేలా చేశారు. అనంతరం వారి ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలుగు అసోసియేషన్ వారికి నిజాంను అప్పజెప్పారు. జెడ్డా నుంచి సౌదీ రాజధాని రియాద్ కు నిజాంను తీసుకొచ్చారు. అక్కడ నుంచి



అనంతపురం తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని అంశాలు అధికారులతో మాట్లాడారు. గురువారం సాయంత్రం నిజాం సౌదీ నుంచి అనంతపురం చేరుకున్నారు. ఆజాద్ నగర్ కు చేరుకోగానే నిజాం కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది నిజాం ఇంటికి వెళ్లి పరామర్శించారు. అక్కడ ఆయన ఎదుర్కొన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని మీ కుటుంబానికి ఎమ్మెల్యే దగ్గుపాటి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. నిజాం అనంతపురం తీసుకురావడమే కాకుండా ఆయన కుమారుడికి ఆయన వైద్య ఖర్చులను కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎమ్మెల్యే అందిస్తారన్నారు. అలాగే సొంత ఇల్లు కూడా మంజూరు చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా నిజాం మాట్లాడుతూ నా పరిస్థితిని వీడియో ద్వారా తెలియజేసినప్పుడు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంటనే స్పందించారన్నారు. ఆయన సొంత ఖర్చులతోనే ఇప్పుడు సౌదీ నుంచి వచ్చేలా చూసారన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు మంత్రి నారా లోకేష్ గారిని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని ఎప్పటికీ మరవలేమని ఉద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు సుందర్, దత్తాత్రేయ ఆలయ కమిటీ చైర్మన్, టిడిపి నాయకుడు రాయల్ మధు టిడిపి నాయకులు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చాబహార్‌పోర్టుపై భారత్‌కు ఉపశమనం

### అమెరికా ఆంక్షల గడుపు పొడిగింపు

అమెరికా ఆంక్షల గడువు పొడిగింపుతో భారత్‌కు ఊరట

ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట లభించింది. వచ్చే ఏడాది ప్రారంభం వరకు అమెరికా ఆంక్షల నుంచి దీనికి మినహాయింపు దొరికింది. అమెరికా గతంలో ఇచ్చిన మినహాయింపునకు నేటితో గడువు ముగిసిన నేపథ్యంలో మళ్ళీ ఈ గడువు పొడిగింపు వచ్చింది. దీంతో చాబహార్ పోర్టులోని షహీద్ బెహెస్తి టెర్మినల్ అభివృద్ధి. నిర్వహణకు భారత్‌కు వీలు కలిగింది. చాబహార్ పోర్టుపై ఆరు నెలల పాటు ఈ ఆంక్షల మినహాయింపు ఉందని భారత ప్రభుత్వం ధ్రువీకరించింది. మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్యం నెరపడానికి చాబహార్ పోర్టు ప్రధాన మార్గంగా ఉంది. ఈ పోర్టు అభివృద్ధి. నిర్వహణలో భారత్ కీలక పాత్ర నేపథ్యంలో ఇప్పటికే న్యూఢిల్లీ ఈ ప్రాజెక్టులో భారీగా పెట్టుబడులు పెట్టింది. కజగిస్థాన్. కిర్గిజ్ రిపబ్లిక్ తజికిస్థాన్, తుర్క్మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాలకు భారత్ ఇక్కడి నుంచి సరకు రవాణా చేయవచ్చు. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్థాన్‌కు భారత్ అందించే ఆహార ధాన్యాలను కూడా ఈ మార్గంలోనే పంపిస్తున్నారు. ఈ ఓడరేవులో 10ఏళ్ల పాటు టెర్మినల్ నిర్వహణ కోసం గత ఏడాది భారత్–ఇరాన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది.

# అధికారం కోసం దిగజారుడు రాజకీయాలు

### కాంగ్రెస్ ఆర్జేడీ పార్టీలపై ప్రధాని మోదీ విమర్శలు, వేడెక్కుతున్న బీహార్ రాజకీయాలు

బీహార్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతున్న వేళ ప్రచార వేడి మరింతగా రాజుకుంటోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ముజఫ్ఫర్‌పూర్ ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ–కాంగ్రెస్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీలు ఎక్కడుంటే అక్కడ జంగిల్ రాజ్ వస్తుందని మోదీ దుయ్యబట్టారు. “అర్జేడీ, కాంగ్రెస్ పాలనను ఐదు పదాల్లో చెప్పొచ్చన్నారు. కట్టా (నాటు తుపాకీ), క్రూరతా (క్రూరత్వం), కటుత (దురుద్దేశం), కుశాసన (సుపరిపాలన లేకపోవడం) కరప్షన్. (అవినీతి).. ఇవే ఆ పార్టీల పాలనా విధానాలు, ఆయుధం ఉన్నచోట క్రూరత్వం ఉంటుంది. ఆటవిక రాజ్యం వస్తుంది. ఆర్జేడీ అధికారంలో ఉన్న



సమయంలో షోరూంలో నుంచి వాహనాలను దోచుకెళ్లారు. వారి హయాంలో బీహార్‌లో 35 వేల నుంచి 40వేల వరకు కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి” అని మోదీ మండిపడ్డారు. మహాగడ్ బంధన్ విభేదాల గురించి ప్రస్తావిస్తూ మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. “ఆర్జేడీ–కాంగ్రెస్ పార్టీలది నూనె, నీరు లాంటి బంధం. ఆ రెండూ ఎప్పటికీ కలవవు. బీహార్‌లో వారు కలిసి చేస్తున్న ర్యాలీలన్నీ ఓట్ల కోసం చేస్తున్న బూటకపు చర్యలే” అని ప్రధాని ఎద్దేవా చేశారు. తనను విమర్శించడం అంటే, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తమ జన్మహక్కులా భావిస్తున్నారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన ఛఠ్ పూజను కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలు అవమానించాయని మోదీ విమర్శించారు. ఓట్ల కోసం వారు ఎంతకైనా దిగజారుతారని మండిపడ్డారు. ఇలాంటి అవమానాన్ని బీహార్ తల్లులు ఎన్నటికీ మర్చిపోరని, అలాంటి వారిని క్షమించబోరని అన్నారు. ఇక. ఛఠ్ పూజకు యునెస్కో గుర్తింపు దక్కేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు.

## పదమూడేళ్ళుగా పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల అరెస్టు

జమ్మూకశ్మీర్ పోలీసులు ఇద్దరు ఆర్థికనేరగాళ్లను అరెస్టుచేశారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వారిని అదుపులోకి తీసుకున్నారు. 13 ఏళ్లుగా వారు పరారీలో ఉన్నారని గురువారం అధికారులు వెల్లడించారు. దోపిడీ, కిడ్నాప్ కేసులు ఎదుర్కొంటున్న ముదాసిర్ అహ్మద్, ముస్తఖ్ అహ్మద్ వనీ పోలీసుల కళ్లుగప్పి 13 ఏళ్లుగా పరారీలో ఉన్నారు. వారిని కర్ణాటక, మహారాష్ట్రలో గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. రెండు ప్రత్యేక బృందాలు వారిని గుర్తించడంలో కీలక పాత్ర పోషించాయని, జమ్మూకశ్మీర్ పోలీసు ఉన్నతాధికారి ఖలీల్ అహ్మద్ పోస్వాల్ వెల్లడించారు. ఇది పోలీసుల నిబద్ధతకు నిదర్శనమని, ఏ ఒక్కరు కూడా చట్టానికి అతీతులు కారని వెల్లడించారు. గండేర్బల్ జిల్లా వ్యాప్తంగా 81 మంది పరారీలో ఉండగా, ఇప్పటివరకు గుర్తించి, అదుపులోకి తీసుకున్నవారి సంఖ్య 24కు చేరిందని చెప్పారు. మిగతావారిని సాధ్యమైనంత త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు.

# ముంబాయి చిన్నారులను బంధించిన దుండగుడు

### పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఖతం

ముంబయిలో ఆడిషన్స్ కోసం వచ్చిన చిన్నారులను బంధించిన వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. 17 మంది చిన్నారుల సహా 10 మందిని పోలీసులు రక్షించారు. ఈ క్రమంలో జరిగిన ఎదురు కాల్పుల్లో నిందితుడు హతమయ్యాడు. రెస్క్యూ ఆపరేషన్ సమయంలో నిందితుడు కాల్పులు జరిపాడని, దీంతో ఎదురు కాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసులు




వెల్లడించారు. తీవ్ర గాయాలైన అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయినట్లు సమాచారం. ముంబయి పవయీ ప్రాంతంలోని ఆర్ఏ యాక్టింగ్ స్టూడియోలో రోహిత్ ఆర్య అనే వ్యక్తి గత నాలుగైదు రోజులుగా ఆడిషన్స్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం 8, 14 ఏళ్ల వయసులోపు ఉన్న 100 మంది చిన్నారులు స్టూడియోకు వచ్చారు. కొంత సమయం తర్వాత చిన్నారులను బయటకు పంపించిన రోహిత్, కొంత మందిని మాత్రం బంధించాడు. దీంతో భయాందోళనలకు గురైన పిల్లలు స్టూడియో కిటికీల నుంచి సాయం కోసం అరిచారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వడంతో రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. నిందితుడికి సర్దిచెప్పేందుకు పోలీసులు ప్రయత్నాలు చేసినప్పటికీ వారిని విడిచి పెట్టేందుకు అతడు నిరాకరించాడు. చిన్నారులకు హాని కలిగిస్తానని బెదిరించడంతో అప్రమత్తమైన రెస్క్యూ బృందం, బాత్రూమ్ ద్వారా లోనికి ప్రవేశించింది. 17 మంది చిన్నారులు సహా 19 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చింది. ఆ సమయంలోనే నిందితుడు కాల్పులు జరిపిన నేపథ్యంలోనే ఎన్‌కౌంటర్ జరిగినట్లు తెలుస్తోంది. సంఘటనా స్థలం నుంచి ఎయిర్ గన్, కొన్ని రసాయనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అంతకుముందు ఓ ఆడియో విడుదల చేసిన నిందితుడు, తన పేరు రోహిత్ అని, ఆత్మహత్యకు బదులు చిన్నారులను నిర్బంధించాలనే ప్లాన్ రచించినట్లు వెల్లడించాడు. తనకు డబ్బులు వద్దని కొంతమందితో మాట్లాడాలని, వారి నుంచి కొన్ని సమాధానాలు తెలుసుకోవాలని పేర్కొన్నాడు.

## కుంటి సాకులతో పరిహారం ఎగ్గొట్టడం నేరం

### బీమా కంపెనీలకు సుప్రీకోర్టు చురకలు

పరిహారం చెల్లింపు విషయంలో బీమా కంపెనీలకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రూట్ పర్మిట్ ఉల్లంఘన వంటి సాంకేతిక కారణాలు చెప్పి బాధితుడికి పరిహారం నిరాకరించడం సరికాదని పేర్కొంది. ఓ ప్రమాదంలో బాధితుడి తప్పదం లేదని, అలాంటప్పుడు అతడికి పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. అంతేకాదు. సంబంధిత పరిహారాన్ని వాహన యజమాని నుంచి రికవరీ చేసుకోవచ్చని గతంలో హైకోర్టు ఇచ్చిన అదేశాలు సమర్థనీయమనిపేర్కొంది. కర్ణాటకలో అక్టోబర్ 7, 2014లో వేగంగా వచ్చిన ఓ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే చనిపోయాడు. ఈ కేసులో బాధితుడికి వడ్డీతో కలిపి రూ.18.86 లక్షల పరిహారం ఇవ్వాలని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఈ పరిహారం సరిగ్గా లెక్కించలేదని పిటిషనర్, మరోవైపు ప్రమాదానికి కారణమైన వాహనం రూట్ పర్మిట్‌ను ఉల్లంఘించిందని బీమా కంపెనీ ఆరోపిస్తూ అక్కడి హైకోర్టును ఆశ్రయించాయి. విచారించిన హైకోర్టు బాధితుడికి పరిహారం చెల్లించాల్సిందేనని బీమా సంస్థకు స్పష్టం చేసింది. అయితే, దానిని వాహన యజమాని నుంచి రికవరీ చేసుకునేందుకు అనుమతిచ్చింది. దీనిని సవాలు వేస్తూ బీమా సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. మరోవైపు రికవరీకి వీలు కల్పించడాన్ని సవాలు చేస్తూ వాహన యాజమాని కూడా సుప్రీంకు వెళ్లారు. విచారించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ రెండు ఆప్పీళ్లను తోసిపుచ్చింది. సాంకేతిక కారణాలు చెప్పి బాధితుడికి పరిహారం నిరాకరించడం సరికాదని, అది సహజ న్యాయ భావనకు విరుద్ధమని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో బాధితుడికి పరిహారం చెల్లించాలని, దాన్ని యజమాని నుంచి రికవరీ చేసుకోవడం సమర్థనీయమేనని పేర్కొంది.



# శవాలను సైతం పీక్కుతినే లంచావతారాలు

### కర్ణాటక ప్రభుత్వ ఉద్యోగుల పైశాచిక బాగోతంపై కూతురి మరణంలో పుట్టెడు శోకంతో ఓ తండ్రి అరణ్య రోదన

బతికున్న మనుషలను చంపుకుతినే పింజారీలే నయమనిపించేలా వ్యవహరించిన కర్ణాటక ప్రభుత్వ ఉద్యోగుల పైశాచిక ఉదంతమిది. లంచాలు ఇచ్చి తాను ఎంతగానో విసిగిపోయానని, కుమార్తె మరణించిన బాధలో ఉన్నా ఎవరూ కనికరం చూపలేదని బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి నెట్టింట్లో షేర్ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో సీఎఫ్ఎ విధులు నిర్వర్తించిన ఓ ఉన్నత ఉద్యోగి అరణ్య రోదన మనవాతా వాదుల గుండెలను పిండేస్తోంది. లింక్డిన్‌లో ఆయన షేర్ చేసిన పోస్టు ప్రకారం బెంగళూరుకు చెందిన కె శివకుమార్ 34 ఏళ్ల కుమార్తె అక్షయ మెదడులో రక్తస్రావం కారణంగా సెప్టెంబర్లో ప్రాణాలు కోల్పోయారు. తన కుమార్తె బీటెక్, ఐఐఎం అహ్మదాబాద్ నుంచి ఎంబీఏ పూర్తిచేశారని వెల్లడించారు. ఆమె గోల్డ్ మన్ శాక్స్‌లో కూడా పనిచేశారు. కూతురు మరణించిన తర్వాత లాంచనాలు పూర్తి చేసి, సంబంధిత పత్రాలు పొందేందుకు అంబులెన్స్ ఆపరేటర్లు, పోలీసు అధికారులు. శ్మశానవాటిక సిబ్బంది, స్థానిక యంత్రాంగానికి చెందిన ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్కరికీ లంచం ఇవ్వాల్సి వచ్చిందని వెల్లడించారు. “నా బిడ్డ మృతదేహాన్ని తరలించడానికి అంబులెన్స్ డ్రైవర్ రూ.3వేలు వసూలు చేశాడు. ఎఫ్ఐఆర్ కాపీ, పోస్ట్ మార్టం రిపోర్ట్ కోసం పోలీస్ స్టేషన్కు వెళ్తే బహిరంగంగానే నగదు డిమాండ్ చేశారు. ఉన్న ఒక్కగానొక్క బిడ్డ చనిపోయి నేనుంటే అలాంటి తండ్రిపట్ల వారు ఎలాంటి కనికరం చూపలేదు. నా దగ్గర డబ్బు ఉంది. ఇచ్చాను. కానీ పేదవాళ్ల పరిస్థితి ఏంటి..? ఇలా డబ్బు వసూలు చేసినప్పుడు తమకూ ఒక కుటుంబం ఉందన్న ఆలోచన వారికి రాదా..! ఇక నా లంచం వేదన ఇక్కడితో తీరలేదు. మరణ ధ్రువీకరణపత్రం కోసమూ నేను ఇబ్బంది పడాల్సి వచ్చింది. రాష్ట్రంలో కుల గణన జరుగుతోందని, సిబ్బంది ఎవరూ లేరని ఐదు రోజుల పాటు తిప్పిపంపారు. అధికారిక రుసుం కంటే ఎక్కువ మొత్తం చెల్లించిన తర్వాత బెంగళూరు మహానగర పాలక సీనియర్ సిబ్బంది దానిని జారీ చేశారు, నారాయణ మూర్తి, అజీమ్ ప్రేమ్ జ్ కిరణ్ మజుందార్ షా వంటి బిలియనీర్లు ఈ నగరాన్ని కాపాడగలరా...?” అని ఆ తండ్రి ఉద్వేగానికి గురయ్యారు. అయితే, ఆ తర్వాత తన పోస్టును ఆయన తొలగించారు. అయినప్పటికీ ఇందుకు సంబంధించిన స్క్రీన్ షాట్లు వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఈ పోస్టు తమ దృష్టి వచ్చిన వెంటనే బెంగళూరు వైట్‌ఫీల్డ్ పోలీస్ స్టేషన్ ఉన్నతాధికారులు తక్షణం స్పందించారు. ఈ కేసులో లంచం ఆరోపణలు ఎదుర్కొన్న ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా అనుచిత ప్రవర్తనను పోలీస్ శాఖ సహించదని పేర్కొన్నారు.

# ఇద్దరికీ.. డీల్ సెట్టయ్యింది!



- చైనాపై 10శాతం టారిఫ్‌లు తగ్గింపు
- సోయాబీన్ దిగుమతికి చైనా అంగీకారం..
- రేర్ ఎర్త్సపైనా కుదిరిన ఒప్పందం
- జిన్‌పింగ్‌కు పదికి 12 మార్కులిస్తున్నా..
- ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- బూసాన్ ఎయిర్‌పోర్టులో జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ

అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్నవేళ -దేశాధినేతలు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ గురువారం భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటలపాటు అంతర్గతంగా సమావేశమైన వీరు పలు కీలకాంశాలపై చర్చలు జరిపారు. జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్లను 10శాతం మేర తగ్గిస్తున్నట్టు ప్రకటించారు.

**ఫెంటనిల్ టారిఫ్ తగ్గింపు..**

"జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే పెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్లు 57శాతం నుంచి 47శాతానికి దిగిరానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరింది" అని ట్రంప్ వెల్లడించారు.

**రేర్ ఎర్త్సపై కుదిరిన డీల్..**

అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్యా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనానుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బందీ ఉండబోదన్నారు. ఈ ఖనిజాలను ఏడాదిపాటు అగ్రరాజ్యానికి ఎగుమతి చేసేలా ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ అరుదైన ఖనిజాల కారణంగానే ఇటీవల ట్రంప్ చైనాపై 100శాతం సుంకాల హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. తాజా డీల్‌తో బీజింగ్‌కు ఊరట లభించినట్లయ్యింది. ఇక చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్టు ట్రంప్ సంకేతాలిచ్చారు.

**జిన్‌పింగ్‌కు 12/10..**

ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడిపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్- రష్యా యుద్ధంపైనా అమెరికాతో కలిసి పనిచేసేందుకు చైనా అంగీకరించినట్టు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్లో తాను చైనాలో పర్యటిస్తానని వెల్లడించారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా అమెరికాకు వస్తారని అన్నారు.

**ఎయిర్‌పోర్టులోనే భేటీ..?**

జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి దక్షిణకొరియాలోని బూసాన్ నగరంలోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు వేదికైంది. విమానాశ్రయంలో వీరిద్దరూ సమావేశమవడంపై కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, షెడ్యూల్ కారణాల వల్లే మీటింగును ఇక్కడ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ట్రంప్ బుధవారమే దక్షిణకొరియా నుంచి వెళ్లిపోవాల్సింది. దానికంటే ముందు నిన్న సాయంత్రం జిన్‌పింగ్‌తో భేటీ అవ్వాలని అమెరికా అధ్యక్షుడు భావించారు. సమయాభావం కారణంగా సమావేశాన్ని గురువారం ఉదయానికి మార్చారు. చివరి నిమిషంలో నిర్ణయం తీసుకోవడంతో.. ఎయిర్పోర్టులోనే భేటీకి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం దక్షిణ కొరియా నుంచి ట్రంప్ వెళ్లిపోయారు.

**ఆరేళ్ల తరువాత ముఖాముఖి భేటీ**

దాదాపు ఆరేళ్ల తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లు ముఖాముఖి భేటీ అయ్యారు. దక్షిణ కొరియాలోని బూసాన్‌లో వీరి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. జిన్‌పింగ్‌పై ప్రశంసలు కురిపించారు. 2019లో జపాన్‌లో జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశంలో ఇరువురి నేతలు చివరిసారిగా భేటీ అయ్యారు. 'నా స్నేహితుడు, చాలాకాలంగా చైనాకు అత్యంత విశిష్టమైన, గౌరవనీయమైన అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలవడం గౌరవంగా ఉంది. మా మధ్య అద్భుతమైన సంబంధాన్ని ఇలాగే కొనసాగిస్తామని నేను భావిస్తున్నా' అని ట్రంప్ పేర్కొన్నారు. జినిపింగ్ మాట్లాడుతూ.. "చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ ట్రంపును కలవడం ఆనందంగా ఉంది" అన్నారు. తమ మార్గదర్శకత్వంలో ఇరుదేశాల సంబంధాలు స్థిరంగా ఉన్నాయన్నారు. రెండు ప్రముఖ ఆర్థిక వ్యవస్థల మధ్య అప్పుడప్పుడు ఘర్షణలు తలెత్తడం సాధారణమని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు.



## అణు పరీక్షలు మొదలెట్టండి

- డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌ను ఆదేశించిన అధ్యక్షుడు
- ట్రూత్ సోషల్లో ట్రంప్ పోస్టు సంచలనం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా సంచలన నిర్ణయం తీసుకున్నారు. అణ్వాయుధ పరీక్షలు తిరిగి ప్రారంభించాలని తాను డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. రష్యా, చైనాలు తమ అణ్వాయుధ కార్యక్రమాలను విస్తరిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈమేరకు ట్రంప్ ట్రూత్ సోషల్లో పోస్టు పెట్టారు. 'ప్రపంచంలోని ఇతర దేశాల కంటే యూఎస్ ఎక్కువ అణ్వాయుధాలు కలిగిఉంది. నా మొదటి పదవీ కాలంలోనే దీన్ని సాధించాం. దీనికి విపరీతమైన విధ్వంసకర శక్తి ఉన్నందున నేను ఇది చేయడానికి ఇష్టపడలేదు. కానీ.. ఇప్పుడు వేరే మార్గం లేదు. అణ్వాయుధ కార్యక్రమాల్లో రష్యా రెండోస్థానంలో ఉంది. చైనా మూడోస్థానంలో ఉంది. ఐదేళ్లలోపు అవి సమానంగా ఉంటాయి. ఇతర దేశాలూ దీని కార్యక్రమాలు విస్తరిస్తున్నందున.. మన అణ్వాయుధ పరీక్షలను తిరిగి ప్రారంభించాలని నేను యుద్ధశాఖను ఆదేశించాను. ఈ ప్రక్రియ వెంటనే ప్రారంభమవుతుంది' అని ట్రంప్ రాసుకొచ్చారు.

రష్యా తన ఆయుధ ఉత్పత్తిని విస్తరిస్తోంది. ఇందులోభాగంగా ఇటీవల కీలక ఆయుధ నియంత్రణ ఒప్పందాల నుంచి వైదొలిగి.. అధునాతన అణు సామర్థ్యాలను విస్తరిస్తోంది. అణుశక్తి ఆధారిత సబ్ మెర్సిబుల్ డ్రోన్ 'పోసిడాన్'ను విజయవంతంగా పరీక్షించిన సంగతి తెలిసిందే. ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ క్రమంలో బీజింగ్ కూడా తన ఆయుధ సంపత్తిని విస్తరిస్తోంది. మరో ఐదేళ్లలోపు చైనా అణు సామర్థ్యాలు.. అమెరికా, రష్యాకు సమానస్థాయికి చేరుకోగలవని యూఎస్ నిఘా వర్గాలు ఇటీవల హెచ్చరించాయి. మరోవైపు.. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీకి కొన్ని గంటలముందు ట్రంప్ అణు పరీక్షల గురించి ప్రకటన చేయడం గమనార్హం. ట్రంప్ ఆదేశాల గురించి పెంటగాన్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# సీమాంతర ఉగ్రవాదం.. పాక్ హక్కా?

- దాయాది చర్యలపై భారత్ మండిపాటు
- అఫ్గాన్ సార్వభౌమత్వానికి కట్టుబడి ఉన్నామని ప్రకటన



అఫ్గానిస్థాన్-పాకిస్థాన్ మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న ఘర్షణలపై భారత్ స్పందించింది. అఫ్గాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, స్వాతంత్ర్యానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పాక్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడింది. సీమాంతర ఉగ్రవాదం కొనసాగింపును ఓ హక్కుగా భావిస్తున్నట్టు కనిపిస్తోందని ధ్వజమెత్తింది. కాబుల్ చర్చలు విఫలమవడానికి భారత్ కారణమంటూ పాక్ ఆరోపించిన నేపథ్యంలో విదేశాంగశాఖ ఈ విధంగా స్పందించింది. "అఫ్గానిస్థాన్ తన సొంత భూభాగాన్ని పాలించుకోవడంపై పాకిస్థాన్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.. సీమాంతర ఉగ్రవాదాన్ని యథేచ్ఛగా కొనసాగించే హక్కు ఉందని పాక్ భావిస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ చర్యలను పొరుగు దేశాలు ఆమోదించవు. అఫ్గాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, స్వాతంత్ర్యానికి భారత్ కట్టుబడి ఉంది" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. అఫ్గాన్‌పై ఈనెల ప్రారంభంలో పాకిస్థాన్ దాడులు జరపడం ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైంది. అయితే, సరిహద్దులో కాల్పుల విరమణ, సీమాంతర ఉగ్రవాదం తదితర అంశాలపై తుర్కియే వేదికగా ఇటీవల ఆ రెండు దేశాలు చర్చలు జరిపినప్పటికీ అవి విఫలమయ్యాయి. ఇదే అంశంపై పాక్ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పందిస్తూ.. తాలిబన్లను భారత్ నియంత్రిస్తోం దని, వాళ్లు భారత్ చేతిలో కీలుబొమ్మలుగా మారారని ఆరోపించారు. అఫ్గాన్ చర్చలు విఫలమవడానికి భారత్ కారణమని అక్కసు వెళ్లగక్కిన విషయం తెలిసిందే.

## అంతరిక్షంలోకి పాక్ వ్యోమగామి

**తమ వ్యోమగాములతో కలిపి పంపుతున్నట్టు చైనా ప్రకటన**

2030నాటికి చంద్రుడిపైకి వ్యోమగాములను దింపుతామని స్పష్టం చైనాకు చెందిన మానవ సహిత అంతరిక్ష కేంద్రం (సీఎంఎస్ఏ) గురువారం కీలక ప్రకటన చేసింది. తమ దేశ వ్యోమగాములతో పాటు పాకిస్థాన్ వ్యోమగామిని అంతరిక్షంలోకి తీసుకెళ్లేందుకు సిద్ధమైనట్టు తెలిపింది. దీనికి సంబంధించి పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యోమగాములకు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొంది. పాక్ అంతరిక్ష కేంద్రం ఎంపిక చేసిన ఇద్దరు వ్యోమగాములు.. చైనా వ్యోమగాములతో కలిసి శిక్షణ తీసుకుంటారని సీఎంఎస్ఏ ప్రతినిధి జాంగ్ జింగ్బో వెల్లడించారు. ఈక్రమంలో వారిలో ఒకరిని పెలోడ్ స్పెషలిస్ట్‌గా స్వల్పకాలిక అంతరిక్ష ప్రయాణ మిషన్‌లో పాల్గొనేందుకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. పాక్ వ్యోమగామి మిషన్ సమయంలో శాస్త్రీయ ప్రయోగాలతోపాటు సాంకేతిక ప్రదర్శనలకు సంబంధించి చైనా వ్యోమగాములకు సాయం అందిస్తారని తెలిపారు.

**2030నాటికి చంద్రుడిపైకి వ్యోమగామి: చైనా**


ఇదిలాఉండగా.. 2030నాటికి చంద్రుడిపై తమ వ్యోమగామిని దింపేందుకు సిద్ధంగా ఉన్నామని జింగ్బో పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో అగ్రగామిగా ఉండాలనే ప్రతిష్టాత్మక ప్రణాళికతో ఉన్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన వ్యోమగాముల బృందాన్ని త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఈ సందర్భంగా టియాంగాంగ్ అంతరిక్ష కేంద్ర నిర్మాణంలో భాగంగా.. వ్యోమగాములను రీప్లేస్ చేసేందుకు సిద్ధమైనట్టు తెలిపారు. జాంగ్ లు, వు ఫీ, జాంగ్ హాంగ్ జాంగ్‌లు ఈ మిషన్‌లో భాగమైనట్టు తెలిపారు. శుక్రవారం రాత్రి 11:44 గంటలకు చైనాలోని జియుక్వాన్ ప్రయోగ కేంద్రంనుంచి ఈ మిషన్ బయలుదేరుతుందన్నారు. తాజా మిషన్‌లో వ్యోమగాములు తమతోపాటు నాలుగు ఎలుకలను కూడా తీసుకువెళతారని వివరించారు.

## పని పర్మిట్ల ఆటో రెన్యువల్స్ రద్దు

**వలస ఉద్యోగులపై అమెరికా పిడుగు**

**భారతీయులపైనా తీవ్ర ప్రభావం**

వలసదారులపై కఠిన విధానాలు అమలుచేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. వలసదారులు పని అనుమతులను ఆటోమేటిక్‌గా రెన్యువల్ చేసే విధానానికి ముగింపు పలికింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఈ మేరకు ప్రకటన చేసింది. దీంతో వేలాది విదేశీయులు ముఖ్యంగా భారతీయులు తమ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. "అక్టోబరు 30 లేదా తర్వాతనుంచి వర్క్ పర్మిట్లను (ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్స్) పునరుద్ధరించుకునేందుకు దరఖాస్తు చేసుకునే వలసదారులకు ఇకపై ఆటోమేటిక్ రెన్యువల్ ఉండదు. అయితే ఈ తేదీకంటే ముందు పని అనుమతులను పొడిగించుకున్న వారిపై ఎలాంటి ప్రభావం ఉండదు" అని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తమ ప్రకటనలో వెల్లడించింది. ప్రజా భద్రత, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కొత్త నిబంధనలు తీసుకొచ్చినట్టు తెలిపింది. గతంలో బైడెన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వలసదారులు తమ వర్క్ పర్మిట్ కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా 540 రోజుల వరకు అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు వీలుండేది. ఈ విధానానికి ముగింపు పలుకుతూ తాజాగా ట్రంప్ సర్కారు కొత్త రూల్స్ తీసుకొచ్చింది. పని అనుమతులు పొడిగింపు కోసం వలసదారులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని అగ్రరాజ్య అధికారులు స్పష్టం చేశారు. ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ల రెన్యువల్ కోసం దరఖాస్తులను వలసదారులు ఎంత ఆలస్యం చేస్తే వారికి అంత నష్టం. ఒక్కోసారి తాత్కాలికంగా పని అనుమతులను కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. అందుకే వర్క్ పర్మిట్ల గడువు ముగియడానికి 180 రోజుల ముందే రెన్యువల్ కోసం దరఖాస్తులు సమర్పిస్తే మంచిది" అని యూఎస్‌సీఐఎస్ సూచించింది. అమెరికాలో ఉద్యోగం అనేది ఒక అవకాశం మాత్రమేనని, వలసదారుల హక్కు కాదని యూఎస్‌సీఐఎస్ డైరెక్టర్ జోసెఫ్ వ్యాఖ్యానించారు.




# జెమీమా అజేయ సెంచరీ

- మహిళల వరల్డ్‌కప్ ఫైనల్స్‌కు భారత్
- సెమీస్‌లో ఆస్ట్రేలియాపై ఘన విజయం
- 339 లక్ష్యం.. వీరోచితంగా ఛేదన
- రాణించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్
- చివర్లో రిచా ఘోష్, దీప్తి శర్మ, అమన్‌జోత్ మెరుపులు
- నవంబర్ 2న దక్షిణాఫ్రికాతో తుదిపోరు




భారత జట్టు మహిళల వరల్డ్‌కప్ ఫైనల్స్‌కు చేరుకుంది. నవంబర్ 2న ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. నవీ ముంబయిలోని డీవై పాటిల్ క్రికెట్ అకాడమీలో గురువారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను చిత్తు చేసిన టీమిండియా సగర్వంగా ఫైనల్స్‌లో అడుగు పెట్టింది. జెమీమా రోడ్రిగ్స్ అజేయ సెంచరీ (127 నాటౌట్, 134 బంతులు, 14 ఫోర్లు)కి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (89, 88 బంతుల్లో, 10 ఫోర్లు, 2 సిక్సులు) మెరుపులు తోడవటంతో 339 పరుగుల లక్ష్యాన్ని 48.3 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి భారత్ అలవోకగా ఛేదించింది. చివర్లో వికెట్ కీపర్ రిచా ఘోష్ (26, 16 బంతులు, 2 ఫోర్లు, 2 సిక్సులు), దీప్తి శర్మ (24, 17 బంతులు, 3 ఫోర్లు) అమన్‌జోత్ కౌర్ (15 నాటౌట్, 8 బంతులు, 2 ఫోర్లు) ధాటిగా ఆడి భారత్ విజయంలో తమ వంతు పాత్ర పోషించారు. ఓపెనర్ షఫాలీ వర్మ 10 (5 బంతులు, 2 ఫోర్లు), స్మృతి మంధాన 24 (24 బంతులు, 2 ఫోర్లు, 1 సిక్స్) పరుగులు చేశారు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ లిచ్ ఫీల్డ్ (119, 93 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్ లు) దూకుడుగా ఆడి సెంచరీ సాధించింది. ఎలిస్ పెర్రీ (77, 88 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్ లు) అర్ధ శతకంతో రాణించగా.. ఆష్లీన్ గార్డనర్ (63, 45 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్ లు) చివర్లో మెరుపులు మెరిపించింది. బెత్ మూనీ 24, కిమ్ గార్త్ 17, తాహిలా మెక్‌గ్రాత్(12) పరుగులు చేశారు. భారత బౌలర్లలో శ్రీ చరణి 2, దీప్తి శర్మ 2, క్రాంతి గౌడ్, అమన్ జ్యోత్ కౌర్, రాధా యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.

ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఆసీస్ వికెట్ కోల్పోయింది. రేణుక సింగ్ బౌలింగ్లో అలీసా హీలీ (5) క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగింది. ఆమె ఔటైన వెంటనే వర్షం కురవడంతో ఆటకు కాసేపు అంతరాయం కలిగింది. మ్యాచ్ తిరిగి ప్రారంభమైన తర్వాత ఫోబ్ లిచ్‌ఫీల్డ్ బౌండరీలతో విరుచుకుపడింది. ఆమె 45 బంతుల్లో అర్ధశతకం, 77 బంతుల్లోనే సెంచరీ అందుకుంది. వన్‌డౌన్‌లో వచ్చిన ఎలీస్ పెర్రీ కూడా నిలకడగా ఆడటంతో స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. లిచ్‌ఫీల్డ్‌ను అమన్ జ్యోత్ వెనక్కి పంపడంతో 155 పరుగుల భాగస్వామ్యానికి (133 బంతుల్లో) తెరపడింది. తర్వాత వచ్చిన బెత్ మూనీ, సదర్లాండ్‌ను శ్రీ చరణి వరుస ఓవర్లలో పెవిలియన్‌కు పంపింది. 66 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన పెర్రీని రాధాయాదవ్ ఔట్ చేయడంతో 42 ఓవర్లకు ఆసీస్ 271/6తో నిలిచింది. తర్వాత గార్డనర్ జోరు పెంచింది. రాధా యాదవ్ వేసిన 49 ఓవర్లో వరుసగా రెండు సిక్సులు కొట్టిన గార్డనర్. తర్వాతి బంతికే రనౌటైంది. దీప్తి వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో అలానా కింగ్ (4), సోఫీ మొలినెక్స్ (0) వరుస బంతుల్లో ఔటయ్యారు. ఐదో బంతికి కిమ్ గార్త్ రనౌట్‌గా వెనుదిరిగింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో ముగ్గురు రనౌట్ అయ్యారు. మహిళల వన్డేల్లో అత్యధిక స్కోరు ఛేదనలో భారత్ రికార్డు సృష్టించింది.

## నేను కోలుకుంటున్నా - శ్రేయస్



ఆస్ట్రేలియాతో మూడో వన్డే మ్యాచ్ సందర్భంగా తీవ్రంగా గాయపడిన పడిన టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కోలుకుంటున్నట్లు తెలిపాడు. క్యాచ్ అందుకునే క్రమంలో పక్కటెముకలు నేలను బలంగా తాకడంతో శ్రేయస్ అయ్యర్ ప్లీహానికి తీవ్ర గాయమైంది. దీంతో అయ్యర్‌ను ఐసీయూలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే అతడి ఆరోగ్యంపై బీసీసీఐ అప్‌డేట్స్ ఇస్తూనే ఉంది. సర్జరీ అవసరం లేకుండానే ప్లీహం వద్ద రక్తస్రావం ఆగిపోయేలా చేసినట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. మరో నాలుగైదు రోజులు శ్రేయస్ ఆసుపత్రిలోనే ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలో అయ్యర్ తన ఆరోగ్య పరిస్థితిపై తొలిసారిగా స్పందించాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా గురువారం పోస్ట్ పెట్టాడు. ఇప్పుడు నేను రికవరీ ప్రాసెస్‌లో ఉన్నాను. రోజురోజుకూ మెరుగవుతూ ఉన్నా. మీ అందరి దీవెనలతో త్వరలోనే కోలుకుని వస్తా. మీ మద్దతును ఎప్పటికీ మరిచిపోలేను. భారీ స్థాయిలో మీ ప్రేమను పొందుతున్నందుకు ఆనందంగా ఉంది. నాకు ఆశీస్సులు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. నా గురించి నిరంతరం ఆలోచిస్తున్నందుకు ధన్యవాదాలు' అని అయ్యర్ పోస్ట్‌లో పేర్కొన్నాడు.

**కనీసం రెండు నెలలు..**

శ్రేయస్ ఆసుపత్రి డిశ్చార్జి అయినప్పటికీ.. కనీసం రెండు నెలలపాటు ఆటకు దూరమవుతాడు. అయితే ప్రాణాపాయం నుంచి బయటపడటం మాత్రం అభిమానులకు ఊరటనిచ్చింది. ఏ మాత్రం ఆలస్యం చేసినా ప్రాణాల మీదకు వచ్చేదని ఇప్పటికే వైద్య బృందం పేర్కొన్న విషయం తెలిసిందే. అతడు ఎనిమిది వారాలపాటు బ్యాట్ పట్టడం కష్టమే. జనవరి నాటికి ఫిట్‌నెస్ సాధిస్తే న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో ఆడే అవకాశం ఉంది. అప్పటికీ అందుబాటులో లేకపోతే నేరుగా టీ20 ప్రపంచ కప్‌లోనే ఆడాల్సి ఉంటుంది. అది కూడా తుది జట్టుకు ఎంపికైతేనే బరిలోకి దిగుతాడు. మళ్లీ వచ్చే ఏడాది జూన్‌లో ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో టీమిండియా తలపడనుంది. ఆ సమయంలోనే ఐపీఎల్ కూడా ప్రారంభమవుతుంది. రెండు నెల్లలో పూర్తిగా ఫిట్‌నెస్ సాధిస్తే పొట్టి కప్‌లో ఆడే అవకాశం వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

## ఆస్ట్రేలియా క్రికెట్‌లో మరో తీవ్ర విషాదం

**- బంతి తగిలి యువ క్రికెటర్ మృతి**

ఆస్ట్రేలియా క్రికెట్‌లో మరో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పదకొండేళ్ల క్రితం బంతి తగిలి ఫిల్ హ్యూస్ మైదానంలోనే కుప్పకూలిన ఉదంతం ఇప్పటికీ అభిమానులను కలవరపెడుతూనే ఉంది. అయితే ఇదే తరహాలో 17 ఏళ్ల యువ క్రికెటర్ ప్రాణాలు కోల్పోయాడు. రెండు రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది.

మెల్‌బోర్న్‌కు చెందిన బెన్ ఆస్టిన్ టీ20 మ్యాచ్ కోసం సన్నద్ధమవుతున్నాడు. ట్రైనింగ్ సెషన్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా బంతి అతడి మెడకు బలంగా తగిలింది. దీంతో ఒక్కసారిగా మైదానంలో అతడు కుప్పకూలిపోయాడు. సహచర క్రికెటర్లు స్పందించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు రెండు రోజులపాటు మృత్యువుతో పోరాడిన ఆస్టిన్ గురువారం ఉదయం ప్రాణాలు విడిచినట్లు వైద్యులు తెలిపారు. ప్రాక్టీస్ సమయంలోనూ అతడు తలకు హెల్మెట్ పెట్టుకుని ఉన్నట్లు అక్కడి క్రికెట్ వర్గాలు తెలిపాయి.

బెన్ మరణంపై ఫెర్న్‌ట్రీ గల్లీ క్రికెట్ క్లబ్ ఓ ప్రకటన విడుదల చేసింది. బెన్ క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ మ్యాచ్‌లు కూడా ఆడేవాడు. అతడి ఆకస్మిక మరణం మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. అతడి మృతి మా క్రికెట్ కమ్యూనిటీపై ప్రభావం చూపిస్తుంది. ఈ సందర్భంగా అందరికీ ఓ విజ్ఞప్తి చేస్తున్నాం. ఇలాంటి సమయంలో బెన్ కుటుంబం గోప్యతకు భంగం కలిగించవద్దని విజ్ఞప్తి చేసింది.



## గువహటి టెస్ట్‌లో తొలుత టీ బ్రేక్.. తరువాత లంచ్

దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లో ఆట సమయాల విషయంలో భారత్ కొత్త విధానం అవలంబించనుంది. భారత్ వచ్చే నెలలో స్వదేశంలో దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ ఆడనుంది. నవంబర్ 14 నుంచి కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా మొదటి టెస్టు జరగనుంది. నవంబర్ 22 నుంచి గువాహటి వేదికగా రెండో టెస్టులో ఇరు జట్లూ తలపడతాయి. అయితే, గువాహటిలో ఆట సమయాల విషయంలో కొత్త సంప్రదాయానికి భారత్ తెరలేవనుంది. దీనిని కేవలం గువాహటికే పరిమితం చేస్తారా.. ఆ తర్వాత మిగతా సిరీస్ కూ ఇదే పాటిస్తారా? అనేది ఇంకా తెలియదు. అయితే, గువాహటిలో మాత్రం ఐదు రోజులూ కొత్త సంప్రదాయ పద్ధతిలోనే మ్యాచ్ జరగనుంది.

సాధారణంగా టెస్టు మ్యాచ్ అంటే రోజుకు 90 ఓవర్లపాటు ఆట సాగుతుంది. మూడు సెషన్లు ఉంటాయి. భారత్ గడ్డపై ఆడేటప్పుడు తొలి సెషన్ ముగియగానే లంచ్ బ్రేక్ ఇస్తారు. రెండో సెషన్ ముగిసిన తర్వాత టీ బ్రేక్ తీసుకుంటారు. ఇక చివరి సెషన్ ముగిస్తే ఆ రోజుకు ఆట పూర్తైనట్లు లెక్క. అయితే, గువాహటిలో మాత్రం ఫస్ట్ టీ బ్రేక్ రానుంది. ఆ తర్వాతనే లంచ్ బ్రేక్ ఇస్తారు. దీనికి కారణం అక్కడ వాతావరణమే. త్వరగా సూర్యోదయం, సూర్యాస్తమయం కావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి.




**మూడు సెషన్ల టైమింగ్ ఇలా..**

తొలి సెషన్: 9 గంటల నుంచి 11 గంటల వరకు
టీ బ్రేక్: 11 గంటల నుంచి 11.20 గంటల వరకు
రెండో సెషన్: 11.20 గంటల నుంచి 1.20 గంటల వరకు
లంచ్ బ్రేక్: 1.20 గంటల నుంచి 2 గంటల వరకు
మూడో సెషన్: 2 గంటల నుంచి 4 గంటల వరకు

## నవంబర్ 20న స్మృతి పెళ్లి?

భారత స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతోందని తెలుస్తోంది. వచ్చే నెలలోనే ఈ స్టైలిష్ ఓపెనర్ వివాహ బంధంలో అడుగుపెట్టేందుకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. మహిళా క్రికెట్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్మృతి.. ఇప్పటికే ఎన్నో రికార్డులు సాధించింది. ప్రస్తుతం వన్డే వరల్డ్ కప్-2025తో బిజీగా ఉన్న స్మృతి మంధాన.. ఈ టోర్నీ ముగిసిన వెంటనే పెళ్లి పనుల్లో తలమునకలు కానున్నట్లు సమాచారం. కాగా స్మృతి చాన్నాళ్లుగా.. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్‌తో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. 2019 నుంచి డేటింగ్ చేస్తున్న ఈ జంట గతేడాది తమ ఐదో వార్షికోత్సవం అంటూ రిలేషన్షిప్ గురించి అభిమానులతో పంచుకున్నారు. ఆ తర్వాత ప్రతి వేడుకలోనూ కలిసి కనిపించారు స్మృతి-పలాష్. స్మృతితో పాటు టీమిండియా టూర్లకు కూడా వెళుతుంటాడు పలాష్. ఇక స్మృతి స్వస్థలం సాంగ్లీలోనే పెళ్లి జరుగనున్నట్లు తెలుస్తోంది. టైమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపిన వివరాల ప్రకారం.. నవంబరు 20న స్మృతి- పలాష్ పెళ్లి వేడుక జరుగనున్నట్లు తెలుస్తోంది.



భారత జట్టు ఓపెనర్‌గా ఇప్పటికే వన్డేల్లో 115 మ్యాచ్లు ఆడిన స్మృతి .. 14 శతకాల సాయంతో 5253 పరుగులు సాధించింది. ఏడు టెస్టుల్లో 629 పరుగులు చేసింది. అంతర్జాతీయ టీ20 ఫార్మాట్లో 153 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న స్మృతి 3982 పరుగులు సాధించింది. అంతేకాదు.. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌గా ఫ్రాంఛైజీకి తొలి టైటిల్ అందించిన ఘనత ఆమెది.

చైతన్య రథం సినిమా
శుక్రవారం 31 అక్టోబర్ 2025 17

## అలరిస్తున్న లాయి లాయి లే..



రష్మిక, దీక్షితశెట్టి జోడీగా నటించిన సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్. నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే రెండు పాటలు విడుదల చేసిన చిత్ర బృందం.. 'లాయి లాయి లే' గీతాన్ని గురువారం రిలీజ్ చేసింది. రాకేందు మౌళి సాహిత్యం అందించిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. హేషమ్ అబ్దుల్ స్వరాలు సమకూర్చారు. పాటకు మంచి రెస్పాన్స్ వస్తోంది.

## చివరి శ్వాసవరకూ సెట్‌లోనే..



'మాస్ జాతర అంటూ ఆడియన్స్‌ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. "ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడింది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగింది" అన్నారు. "జయాపజయాలను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదోకరోజు తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకు నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవు" అని రవితేజ తెలిపారు.

## మహా కాళీగా.. భూమి




తన సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ) నుంచి ప్రతి ఏడాదీ ఓ సినిమా వస్తుందని ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రానున్న మూడో సినిమా 'మహా కాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబవుతోంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా చిత్రంలో మహాకాళిగా కన్నడ నటి భూమిశెట్టి నటించనున్నట్టు తెలిపారు. 'విశ్వంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్ను పంచుకున్నారు. భూమి శెట్టి ఇటీవల 'కింగ్డమ్'లో కనిపించిన విషయం తెలిసిందే. అందులో సత్యదేవ్ భార్యగా ఆమె అలరించారు. ఇక 'మహాకాళి' షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తయినట్టు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. "మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం" అని అన్నారు. ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్ సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్టు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.

## టాప్ త్రీలో హిట్ త్రీ!



నాచురల్ స్టార్ నాని.. బిగ్ స్క్రీన్స్‌పరంగా, ఓటీటీలపరంగా మంచి క్రేజ్‌తోపాటు, మార్కెట్‌ని బిల్డ్ చేసుకున్నాడు. నాని సినిమా అంటే మినిమం గ్యారెంటీ అనే రేంజ్ ఇప్పుడు కనిపిస్తోంది. నాని సినిమాలకి నాన్ థియేట్రికల్ బిజినెస్సు గట్టిగా జరుగుతుంది. తాజాగా.. నాని 'హిట్–3' ఓటీటీలో క్రియేట్ చేసిన సెన్సేషన్ మరోసారి వైరల్‌గా మారింది. హిట్–3 సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో మొదటి వీకెండ్ స్ట్రీమింగ్‌లో 4 మిలియన్‌కి పైగా వ్యూస్‌ని సొంతం చేసుకుంది. ఇది రీసెంట్ భారీ సినిమాలు ఓజి, దేవరకంటే ఎక్కువ కాగా.. హిట్–3 కేవలం పుష్ప–2, కల్కి 2898 ఎడిలాంటి పాన్ ఇండియా భారీ హిట్స్ తర్వాత మూడోస్థానంలో ఉండడం సంచలనమనే చెప్పాలి. దీనిబట్టి ఓటీటీలో నాని సినిమాల ఆదరణ ఎలా ఉంటుందనేది అర్థం చేసుకోవచ్చు. ఇక నెక్స్ట్ వచ్చే ప్యారడైజ్ పాన్ వరల్డ్ లెవెల్లో రానుంది. దానికి ఎలాంటి రెస్పాన్స్ ఉంటుందో చూడాల్సిందే.

## రణ్‌బీర్ ఎంపిక సబబే



బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారీ 'రామాయణ' కథను మరోసారి ప్రేక్షకుల ముందుకు తెస్తున్న విషయం తెలిసిందే. అయితే, రాముడిగా రణ్‌బీర్ ఎంపికను కొందరు తప్పుపడుతూ ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ట్రోల్స్‌పై ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ –చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో స్పందించారు. రాముడిగా రణ్‌బీర్ ఎంపికను సమర్థించారు. "అలా ట్రోల్ చేయడం అన్యాయం. గతంలో రణ్‌బీర్ అలాంటి పాత్రలు చేశాడు. ఇప్పుడు ఇలాంటి పాత్ర చేయడానికి వీల్లేదనడం అన్యాయమైన తీర్పు. భవిష్యత్తులో రాముడి పాత్ర చేయాల్సి వస్తుందని అతడికి తెలియదు కదా. రేపు ఇంకో సినిమాలో రావణుడిగా నటించవచ్చు. అప్పుడూ ట్రోల్స్ చేస్తారా?. అలా చేయడం సరైన పద్ధతి కాదు" అన్నారు. అలాగే రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్న విషయంపై సద్గురు స్పందిస్తూ.. యశ్ అందమైన, తెలివైన వ్యక్తి అన్నారు. ఇక 'రామాయణ'లో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కూడా నటిస్తున్నారు. ఆయన ఈ సినిమా కోసం తీసుకున్న పారితోషికం మొత్తాన్ని క్యాన్సర్ బాధిత పిల్లల చికిత్సకు విరాళంగా ఇచ్చినట్టు తాజాగా తెలిపారు. ఈ సినిమాలో నటిస్తున్నందుకు ఆనందంగా ఉందన్న వివేక్.. 'రామాయణ'తో భారతీయ చిత్ర పరిశ్రమకు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందన్నారు.

రెండు భాగాలుగా రానున్న ఈ ప్రాజెక్ట్ మొదటి పార్టు షూటింగ్ పూర్తయినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. రూ.4000 కోట్ల భారీ బడ్జెట్‌తో రానున్న ఈ సినిమాలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీడియోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్టు తెలుస్తోంది. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి.

## అఖండకు డివోషనల్ మ్యూజిక్ టచ్

నందమూరి బాలకృష్ణ హీరోగా సంయుక్త మీనన్, హర్షాలీ మల్హోత్రా కీలక పాత్రల్లో దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న అవైటెడ్ చిత్రం "అఖండ 2 తాండవం". భారీ అంచనాలు ఉన్న సినిమా పనులు ఇప్పుడు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక సంగీత దర్శకుడు థమన్ కూడా డెడికేషన్‌తో



సినిమా చేస్తున్నాడట. సంగీతం, సాహిత్యంపరంగా ఎక్కడా తగ్గకుండా దైవత్వాన్ని పాట రూపంలో డిజైన్ చేస్తున్నాడు. ఇటీవల మిశ్రా సోదరులని సంస్కృత సాహిత్యం కోసం తీసుకోగా.. ఇప్పుడు ప్రముఖ క్లాసికల్ సింగర్స్ సర్వేపల్లి సిస్టర్స్‌తో వర్క్ చేస్తున్నట్టు రివీల్ చేశాడు. దీంతో అఖండ 2 డివోషనల్‌పరంగా అద్భుతమైన సాహిత్యం దుమ్ములేపబోతుందనే గ్యారెంటీ అన్న టాక్ వినిపిస్తోంది. పార్ట్ 1లోనే ఎక్సలెంట్ లిరిక్స్ ఉన్నాయి. ఇప్పుడు మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈసారి స్క్రీన్స్‌పై బాలయ్య ఎలాంటి తాండవం చూపిస్తాడో చూడాలి.



## శ్రీలీలతో హిందీ అరుంధతి?

ఇండియన్ సినిమా దగ్గర హారర్ థ్రిల్లర్ సినిమాలు ఒకింత తక్కువే. కామెడీ కలిపేసి ఇప్పుడు వస్తున్నాయి కానీ ప్రాపర్ హారర్ సినిమాల లిస్ట్‌లో మాత్రం తక్కువే కనిపిస్తాయి. అలాంటి తక్కువ సినిమాల్లో కూడా డెఫినెట్‌గా ఉండే సినిమా.. అందులో మన తెలుగు సినిమా "అరుంధతి" ప్రత్యేకం. ఈ సినిమాకి రీమేక్ కోసం తెలుగు బ్యూటీ శ్రీలీల లాక్ అయినట్టు వచ్చిన టాక్ వైరల్ అవుతుంది. అదేంటి ఆల్రెడీ తెలుగు సినిమా మళ్లీ తెలుగు హీరోయిన్‌తో రీమేక్ అనుకుంటున్నారా? ఇది తెలుగులో కాదు, హిందీలో సినిమాకి అట. హిందీలో ఎప్పుడునుంచో పలువురు స్టార్ హీరోయిన్లతో అరుంధతి రీమేక్‌కి ప్లాన్స్ జరిగాయి. కాని అది ఫైనల్‌గా శ్రీలీల వరకు వచ్చిందంటూ కొత్త రుమార్స్ మొదలయ్యాయి. మరి ఇందులో ఎంతవరకూ నిజం ఉందనేది కాలమే నిర్ణయించాలి.